


PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న

తెలుగు దినపత్రిక

RNI : TELTEL/2021/80267

సంపుటి: 5 సంచిక: 87, పేజీలు - 08

సోమవారం, సెప్టెంబర్ 1, 2025 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD




# ప్రభుత్వ స్థలంలో హై రైజ్ అపార్ట్మెంట్స్

## ఎమ్మార్వో నుండి కలెక్టర్ వరకు అమ్ముడుపోయారా.?

- ప్రభుత్వ స్థలం కబ్జా చేసిన మానేపల్లి భూ మాయాజాలం పై మౌనం ఎందుకు
- అసైన్డ్ భూమిలో హై రైజ్ అపార్ట్మెంట్లు, మౌనం గా ఉన్న కలెక్టర్ అనుమతి ఇచ్చిన కమిషనర్
- ప్రభుత్వ స్థలాలకు అనుమతులు ఇస్తున్న హెచ్ఎండిఏ కమిషనర్
- జీవో నెంబర్ 58, 59 నిబంధనలను తుంగలో తొక్కిన అధికారులు
- మానేపల్లి రియాల్టీ అండ్ ఇన్ ఫ్రా కబ్జా వ్యవహారాలపై ప్రజాప్రతినిధుల అండదండలు




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) గత ప్రభుత్వంలో ప్రభుత్వ భూముల కబ్జాలు యదేచ్ఛగా జరిగినాయి. అధికారులు, కబ్జాదారులు ఏకమై ప్రభుత్వ భూములను యదేచ్ఛగా కబ్జా చేస్తున్న పట్టించుకునే నాధుడే లేకుండా పోయాడు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాములో దొరికినోనికి దొరికినంత అన్నట్లుగా ప్రభుత్వ భూములను హద్దు అదుపు లేకుండా దోచుకున్నారు. పత్రికల్లో కథనాలు వచ్చిన ప్రజలు ఫిర్యాదు చేసిన కలెక్టర్ స్పందించిన దాఖలాలు లేవు దానికి తోడు వాళ్ళ హస్తం ఉందన్న ఆరోపణలు ఉన్నాయి దానికి తగ్గట్టుగానే వందల ఎకరాల ప్రభుత్వ భూమి కబ్జా అయిపోయింది. కబ్జాదారులకు మేము అండగా ఉన్నాం అన్నట్లు ప్రభుత్వం జీవో నెంబర్ 58, 59 తీసుకురావడంతో అందులో నియమ నిబంధనలు తుంగలో తొక్కి అసైన్డ్ భూమి దొంగ పద్ధతిలో రిజిస్ట్రేషన్ చేసుకున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. పేదవాడి కోసం తీసుకువచ్చిన జీవో 58, 59 లో పేదవాడికి ఇల్లు కోసం ప్రభుత్వం 300 లోపు గజాల స్థలాన్ని రిజిస్ట్రేషన్ కోసం అనుమతి ఇచ్చింది. అయితే ఎమ్మార్వోలు, ఆర్డీవోలు, కలెక్టర్లు భారీగా అవినీతి అక్రమాలకు పాల్పడుతూ భూ బకాసురులు ఎకరాల భూమి అక్రమ పద్ధతిలో రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఇంతవరకు వీళ్ళ అవినీతి బాగోతం బాగానే ఉన్నా ఇప్పుడు మాత్రం దానిని మానేపల్లి రియాల్టీ ఇన్ ఫ్రా పేరుతో వ్యాపార స్థలాలుగా మార్చుకొని హై రైజ్ అపార్ట్మెంట్లు నిర్మిస్తూ వ్యాపారాలు చేసుకుంటున్నారు. జీవో నెంబర్ 58,59 పేదవాడి ఇంటి కోసం ఇచ్చింది. అయిన ఇంత ఎకరాల స్థలమును ఎలా రిజిస్ట్రేషన్ చేయించారన్నది ప్రశ్నగా మారింది. జీవో 58 59 పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా ఇంత భారీ భూకుంభకోణం జరుగుతుంటే తాసిల్దార్ ఆర్డీవో కలెక్టర్ ఏం చేస్తున్నారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అధికారులందరికీ కోట్లలో లంచాలు అందాయని అందుకోసమే చిన్న ఉద్యోగం నుండి కలెక్టర్ స్థాయి అధికారి వరకు మానంగా ఉన్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పుడు దానిని వ్యాపారం కోసం వినియోగించుకోవడానికి అసైన్డ్ భూములకు హెచ్ఎండీఏ అధికారులు, జిహెచ్ఎంసి అధికారులు అనుమతులు ఇవ్వడం దానికి రేరా అధికారులు సైతం నంబరు కేటాయించడం విడ్డూరంగా మారింది. అయితే ప్రభుత్వ స్థలంలో ఎవరైనా అక్రమ మార్గంలో అపార్ట్మెంట్లు కట్టుకోవచ్చు అన్నట్లుగా మారింది పరిస్థితి. ఇందులో ప్రజలు కోట్లు ఖర్చుపెట్టి అపార్ట్మెంట్లు కొంటే భవిష్యత్తులో వాళ్ల పరిస్థితి ఏమిటన్నది ప్రశ్నార్థకంగా మారింది. తిలా పాపం తలా పిడికెడు అన్నట్లుగా అటెండర్ నుండి కమీషనర్, కలెక్టర్ స్థాయి అధికారులు సైతం ఈ అక్రమాలలో తమ చేతులు కలిపారన్న ఆరోపణలు లేకపోలేదు. అందులో భాగంగా అబ్దుల్లాపూర్ మెట్ మండలంలోని తుర్కయంజాల్ గ్రామంలో సర్వే నంబర్ 212/1 లోని 26 ఎకరాల 12 అసైన్డ్ భూమిని మానేపల్లి రియాల్టీ అండ్ ఇన్ ఫ్రా పేరుతో ఓ భారీ హై రైజ్ అపార్ట్మెంట్ నిర్మించడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బయటికి పెద్దమనుషుల్లా కనిపించే మానేపల్లి జ్యువెలర్స్ యజమాన్యం, ప్రభుత్వ భూమిని బీఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులను అడ్డుపెట్టుకొని కబ్జా చేసి అక్రమ మార్గంలో అనుమతులు తీసుకొచ్చుకొని ఇప్పుడు అపార్ట్మెంట్లు నిర్మించడం ఎంతవరకు సమంజసం అని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

బంగారు వ్యాపారంలో ప్రజలను ఓరకంగా మోసం చేసి భారీగా సంపాదించి అది సరిపోదు అన్నట్లుగా ఇప్పుడు రియల్ ఎస్టేట్ పేరుతో ప్రభుత్వ స్థలాలను కబ్జా చేసి అపార్ట్మెంట్లు నిర్మిస్తుంటే అడ్డుకోవలసిన ప్రభుత్వ అధికారులు వాటికి అక్రమ మార్గంలో లంచాలు తిని అనుమతులు ఇచ్చి సహకరించడం వెనుక భారీ స్థాయిలో అవినీతి అక్రమాలు జరిగినట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైన రేవంత్ సర్కార్ స్పందించి వెంటనే ఈ అనుమతులను రద్దు చేసి ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.


ప్రజాప్రశ్న
తెలుగు దినపత్రిక
03 Apr 2025 - Page 8
https://epaper.prajaprashna.com/clip/45347

మానేపల్లి భూ మాయాజాలం

(కథనం1)
- అసైన్డ్ భూమిలో హై రైజ్ అపార్ట్మెంట్లు
- ప్రభుత్వ స్థలాల్లో కబ్జాదారులకు అనుమతి ఇచ్చిన హెచ్ఎండిఏ
- జీవో నెంబర్ 58, 59 నిబంధనలను తుంగలో తొక్కిన అధికారులు
- జీవో 58, 59 పేదల కోసమా.? కబ్జారాయుళ్ల కోసమా.?


ప్రజాప్రశ్న
తెలుగు దినపత్రిక
11 Apr 2025 - Page 8

అక్షరాల 5 ఎకరాల 23 గుంటల

అసైన్డ్ భూమి కబ్జా

- మానేపల్లి రియాల్టీ అండ్ ఇన్ఫ్రా పేరుతో కబ్జాల బాగోతం
- ప్రభుత్వ స్థలాలను కబ్జా చేసి అపార్ట్మెంట్ల నిర్మాణం
- లక్షలు పెట్టి కొన్న వినియోగదారుల పరిస్థితి ఏమిటి.?
- ప్రభుత్వ అసైన్ భూములను కబ్జా చేస్తే కలెక్టర్ మౌనమెందుకు
- ప్రభుత్వ భూములలో నిర్మాణ అనుమతులు ఇచ్చిన అవినీతి అధికారులపై చర్యలు ఉండవా.?
- జీవో నెంబర్ 58, 59 పేరుతో కబ్జా చేసిన ప్రభుత్వ భూములను కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేయాలి

---

ఇక మనం పోటీదారులం కాదు,

## భాగస్వాములం

### ఎస్‌సీవో వేదికగా స్పష్టం చేసిన మోదీ, జిన్‌పింగ్

- విభేదాలు వివాదాలుగా మారకూడదని ఇరు దేశాధినేతలు ఏకాభిప్రాయం
- సరిహద్దుల్లో శాంతియుత వాతావరణం కొనసాగించాలని నిర్ణయం
- ప్రజల మధ్య సంబంధాలను మరింత పెంచేందుకు అంగీకారం



న్యూఢిల్లీ / తియాంజిన్ (ప్రశ్న న్యూస్) భారత్, చైనా మధ్య ద్వైపాక్షిక సంబంధాలను మరింత ముందుకు తీసుకెళ్లే దిశగా ఒక కీలక పరిణామం చోటుచేసుకుంది. షాంఘై సహకార సంస్థ (ఎస్-సీవో) సదస్సు సందర్భంగా చైనాలోని తియాంజిన్‌లో ఆదివారం భారత ప్రధాని నరేంద్ర మోదీ, చైనా 2లో..

---

కాళేశ్వరం నివేదిక

## ఓ చెత్త కాగితం

### – అసెంబ్లీలో హరీష్ రావు

- కాళేశ్వరం నివేదిక చట్టబద్ధం కాదు, కేవలం రాజకీయ ప్రేరేపితమే
- ఆదివారం రిపోర్టు పెట్టారంటేనే కుట్ర ఉన్నట్టు
- పీసీ ఘోష్ నివేదిక ఓ డొల్ల రిపోర్ట్ అన్న హరీష్ రావు



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) కాళేశ్వరం కమిషన్ నివేదికపై తెలంగాణ అసెంబ్లీలో చర్చ ముందుగా ఊహించినట్లుగానే సెగలు పుట్టించింది. నివేదకలో గత ప్రభుత్వంపై వచ్చిన అవినీతి ఆరోపణలపై మాజీ మంత్రి హరీష్ రావు స్పందిస్తూ తనదైన శైలిలో కౌంటర్ ఇచ్చారు. మొదట యూరియా సమస్యను 2లో..

---

## ఇంటింటికీ స్మార్ట్ రేషన్ కార్డులు

### తెనాలిలో స్వయంగా అందించిన మంత్రి నాదెండ్ల

- రాష్ట్రవ్యాప్తంగా 1.46 కోట్ల కుటుంబాలకు కొత్త కార్డుల పంపిణీ లక్ష్యం
- సెప్టెంబర్ 15లోగా ఇంటింటికీ కార్డుల పంపిణీ పూర్తి చేస్తామన్న మంత్రి నాదెండ్ల
- క్యూఆర్ కోడ్, పోర్టబులిటీ సౌకర్యాలతో ఆధునిక సాంకేతికతతో కార్డులు



తెనాలి (ప్రశ్న న్యూస్) ఆంధ్రప్రదేశ్‌లో ప్రజా పంపిణీ వ్యవస్థను మరింత పారదర్శకంగా, ఆధునికంగా మార్చే దిశగా కూటమి ప్రభుత్వం కీలక అడుగు వేసింది. రాష్ట్రవ్యాప్తంగా అర్హులైన 1.46 కోట్ల కుటుంబాలకు స్మార్ట్ రేషన్ కార్డులు అందించే బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. గుంటూరు జిల్లా తెనాలి నియోజకవర్గంలోని నందివెలుగు గ్రామంలో పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, కేంద్ర 2లో..

---

కాళేశ్వరం కట్టినందుకు

## వీళ్లను ఉరితీయాలి

- అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు - అవసరం లేకున్నా కేంద్రానికి బీఆర్ఎస్ లేఖలు
- ఇంజనీర్ల రిపోర్టు తొక్కిపెట్టినట్లు కమిషన్ తేల్చింది

తెలంగాణ అసెంబ్లీలో కాళేశ్వరం కమిషన్ నివేదిక అధికార ప్రతిపక్ష నేతల మధ్య సెగలు పుట్టిస్తోంది. కమిషన్ నివేదికపై హరీష్ రావు వివరణ ఇస్తున్న కొద్దిసేపటికి మైక్ అందుకున్న సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్టు మేడిగడ్డ వద్ద బ్యారేజీ కట్టినందుకు మిమ్మల్ని ఉరితీయాలంటూ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. 2లో..



---

## ధవళేశ్వరం వద్ద గోదావరి ఉగ్రరూపం

### – కోనసీమలో హై అలర్ట్

అమరావతి (ప్రశ్న న్యూస్) మరోసారి గోదావరి ఉగ్రరూపం దాల్చింది ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షాల ప్రభావంతో గోదావరిలో వరద ప్రవాహం పెరిగి దిగువకు ఉరకలెత్తి ప్రవహిస్తోంది దీంతో భద్రాచలం వద్ద భారీగా పెరిగిన వరద అదే స్థాయిలో అఖండ గోదావరిలో ఉరకలెత్తతోంది, ఈ ప్రభావంతో ధవళేశ్వరం 2లో..



---

డ్యామ్‌కు, బ్యారేజీకి తేడా లేకుండా

## కాళేశ్వరం నిర్మాణం

### – అసెంబ్లీలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక గత బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.87 వేల కోట్లు (87 వేల 4 వందల 49 కోట్లు) వెచ్చించి కట్టిన ప్రాజెక్టు కూలిపోవడం దారుణం అన్నారు మంత్రి ఉత్తమ్ 2లో..



---

మరింత పెరగనున్న

## హైదరాబాద్ విస్తీర్ణం

### - అదనంగా దాదాపు 30 వేల ఎకరాల్లో

2లో..



---

బీసీలకు 42 శాతం

## రిజర్వేషన్ బిల్లులు ఆమోదం

- అసెంబ్లీలో కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య తీవ్ర వాగ్వాదం
- గత బీఆర్ఎస్ ప్రభుత్వ చట్టాలే అడ్డంకిగా మారాయన్న సీఎం రేవంత్
- కాంగ్రెస్ చిత్తశుద్ధిని ప్రశ్నించిన బీఆర్ఎస్ నేతలు
- రాష్ట్రపతి వద్ద పెండింగ్‌లో ఉన్న మార్చి నాటి బిల్లుల ప్రస్తావన

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ స్థానిక సంస్థల్లో వెనుకబడిన తరగతులకు (బీసీ) 42 శాతం రిజర్వేషన్లు కల్పించే కీలక సవరణ బిల్లులకు రాష్ట్ర అసెంబ్లీ ఆదివారం ఆమోదం తెలిపింది. 2లో..



---

## చైనాతో స్నేహమా.?

### - మోదీ సర్కార్‌పై కాంగ్రెస్ ఫైర్

న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) ప్రధాని నరేంద్ర మోదీ, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ మధ్య ఆదివారం టియాంజిన్‌లో ద్వైపాక్షిక చర్చలు జరిగిన నేపథ్యంలో, కేంద్ర 2లో..



ప్రజాప్రశ్న



# ఇక మనం పోటీదారులం కాదు, భాగస్వాములం

అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ మధ్య ఉన్నత స్థాయి సమావేశం జరిగింది. ఈ భేటీలో ఇరు దేశాల మధ్య నెలకొన్న పలు కీలక అంశాలపై ఫలప్రదమైన చర్చలు జరిగాయి. భారత్, చైనాలు పరస్పరం పోటీదారులు కావని, అభివృద్ధిలో భాగస్వాములని ఇరువురు నేతలు పునరుద్ఘాటించారు. ఇరు దేశాల మధ్య ఉన్న అభిప్రాయ భేదాలు ఎట్టి పరిస్థితుల్లోనూ వివాదాలుగా మారకూడదని వారు బలమైన ఏకాభిప్రాయానికి వచ్చారు. గత ఏడాది (2024) రష్యాలోని కజన్‌లో జరిగిన సమావేశం తర్వాత ద్వైపాక్షిక సంబంధాలలో సాధించిన పురోగతిని మోదీ, జిన్‌పింగ్ ఈ సందర్భంగా సమీక్షించారు. ఇరు దేశాల మధ్య స్థిరమైన, స్నేహపూర్వక సంబంధాలు కొనసాగడం ఆర్థిక వృద్ధికి, ప్రపంచంలో బహుళ ధ్రువ వ్యవస్థకు ఎంతో ముఖ్యమని వారు అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా, ద్వైపాక్షిక సంబంధాలు నిరంతరం అభివృద్ధి చెందాలంటే సరిహద్దు ప్రాంతాల్లో శాంతి, ప్రశాంతత అత్యంత కీలకమని ప్రధాని మోదీ నొక్కిచెప్పారు. గత ఏడాది సరిహద్దుల నుంచి ఇరు దేశాల సైన్యాలు విజయవంతంగా వైదొలగడం, అప్పటి నుంచి శాంతియుత వాతావరణం కొనసాగుతుండటంపై నేతలిద్దరూ సంతృప్తి వ్యక్తం చేశారు. సరిహద్దు వివాదానికి సంబంధించి ఇరు దేశాల ప్రజల దీర్ఘకాలిక ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని, రాజకీయ కోణంలో న్యాయమైన, సహేతుకమైన, పరస్పర ఆమోదయోగ్యమైన పరిష్కారం కనుగొనేందుకు కట్టుబడి ఉన్నామని వారు స్పష్టం చేశారు.ప్రజల మధ్య సంబంధాలను మరింత పెంపొందించుకోవాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. ఇందులో భాగంగా, నిలిచిపోయిన ప్రత్యక్ష విమాన సర్వీసులను పునరుద్ధరించడం, వీసా విధానాలను సులభతరం చేయడం వంటి చర్యలు చేపట్టాలని అంగీకరించారు. ఇటీవల కైలాస మానససరోవర యాత్ర, పర్యాటక వీసాలు తిరిగి ప్రారంభమైన నేపథ్యంలో ఈ నిర్ణయం ప్రాధాన్యత సంతరించుకుంది. ఆర్థిక, వాణిజ్య సంబంధాలపై కూడా లోతైన చర్చ జరిగింది. ప్రపంచ వాణిజ్యాన్ని స్థిరీకరించడంలో భారత్, చైనా ఆర్థిక వ్యవస్థలు పోషించగల కీలక పాత్రను ఇరువురు నేతలు గుర్తించారు. ద్వైపాక్షిక వాణిజ్యాన్ని, పెట్టుబడులను విస్తరించుకోవడంతో పాటు, వాణిజ్య లోటును తగ్గించే దిశగా రాజకీయ, వ్యూహాత్మక మార్గనిర్దేశంతో ముందుకు సాగాల్సిన అవసరాన్ని వారు ప్రస్తావించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ ఒక ముఖ్యమైన విషయాన్ని స్పష్టం చేశారు. "భారత్, చైనా రెండూ వ్యూహాత్మక స్వయంప్రతిపత్తిని అనుసరిస్తాయి. మన సంబంధాలను మూడో దేశం కోణంలోంచి చూడకూడదు" అని ఆయన అన్నారు. ఉగ్రవాదం, న్యాయమైన వాణిజ్యం వంటి ప్రాంతీయ, ప్రపంచ సవాళ్లపై బహుళపక్ష వేదికల మీద ఉమ్మడి వైఖరిని అవలంబించాల్సిన ఆవశ్యకత ఉందని నేతలు అభిప్రాయపడ్డారు. ఈ పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ చైనా కమ్యూనిస్టు పార్టీ పొలిట్‌బ్యూరో స్టాండింగ్ కమిటీ సభ్యుడు కై కీతో కూడా ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఇరు దేశాల మధ్య ఆర్థిక, రాజకీయ, ప్రజల మధ్య సంబంధాలను మరింత బలోపేతం చేయడంపై వారు చర్చించారు. మోదీ-జిన్‌పింగ్ మధ్య కుదిరిన ఏకాభిప్రాయానికి అనుగుణంగా ద్వైపాక్షిక సంబంధాలను మెరుగుపరచడానికి చైనా సిద్ధంగా ఉందని కై కీ తెలిపారు. ఎస్‌సీవో సదస్సు నిర్వహణలో చైనా అధ్యక్షతకు ప్రధాని మోదీ మద్దతు తెలిపారు. అదేవిధంగా, 2026లో భారత్ ఆతిథ్యం ఇవ్వనున్న బ్రిక్స్ సదస్సుకు హాజరుకావాల్సిందిగా అధ్యక్షుడు జిన్‌పింగ్‌ను ప్రధాని ఆహ్వానించారు. ఈ ఆహ్వానానికి జిన్‌పింగ్ ధన్యవాదాలు తెలుపుతూ, భారత్ అధ్యక్షతన జరిగే బ్రిక్స్ సదస్సుకు చైనా పూర్తి మద్దతు ఇస్తుందని హామీ ఇచ్చారు.

# కాళేశ్వరం నివేదిక ఓ చెత్త కాగితం

చర్చించే ప్రయత్నం చేసిన హరీశ్ రావును స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అడ్డుకున్నారు. యూరియా సమస్య ఇప్పుడు వద్దు కాళేశ్వరం గురించి మాత్రమే మాట్లాడండి అంటూ అభ్యంతరం తెలపడంతో తిరిగి కాళేశ్వరం నివేదికపై హరీశ్ రావు వివరణ ఇస్తూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఈ ప్రభుత్వం ఇంత ఆదరాబాదరగా ఆదివారం అసెంబ్లీ పెట్టి కాళేశ్వరం కమిషన్ రిపోర్టుపై చర్చపెట్టారంటేనే వీరి ఉద్దేశ్యం ఏంటో అర్థమవుతోంది. కమిషన్ నిబంధనలు పాటించలేదని మేము కోర్టుకు వెళ్లాము. అది మా హక్కు. కమిషన్ రిపోర్టు క్వాష్ అవుతుందనే భయంతోనే ఈరోజు రిపోర్టు అసెంబ్లీలో పెట్టడంతోనే మీ కుట్ర ప్రజలకు అర్థమవుతోంది. పంచాయితీ ఎన్నికలు వస్తున్నాయి కాబట్టే కమిషన్ రిపోర్టు పేరుతో బురద రాజకీయాలు చేస్తున్నారు. పీసీ ఘోష్ కమిషన్ విచారణ చట్టబద్ధంగా జరిగిందా లేదా అనేది సభలో చర్చించాలి. ఫెయిర్ నెస్ అండర్ కమిషన్ ఎంక్వైరీ యాక్ట్ 1952 ప్రకారం నిష్పక్షపాతంగా కమిషన్ విచారణ జరగకపోతే అది చిత్తుకాగితంతో సమానం అని చట్టమే చెబుతోంది. ఇది రాజ్యాంగం కల్పించిన హక్కు. ఒక సభ్యుడిపై ఆరోపణలు చేయాలంటే ముందుగా 8బి, 8సి క్రింద నోటీసులు ఇస్తేనే అది చెల్లుతుంది, లేదంటే చెల్లదు. ఘోష్ కమిషన్ మా హక్కులు కాలరాశారు. మాపై వస్తున్న ఆరోపణలకు మా వద్ద వివరణ తీసుకోకుండానే నివేదిక ప్రభుత్వానికి ఇచ్చారు. నాకు, కేసీఆర్ కు ఎవరికీ క్రాస్ ఎగ్జామిన్ కు నోటీసులు ఇవ్వలేదు. కమిషన్ విచారణలో లోపాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. కాంగ్రెస్ పార్టీ ముందునుంచే కాళేశ్వరం ప్రాజెక్టును అడ్డుకునే ప్రయత్నం చేసారు. కోర్టుల్లో కేసులు వేసి, భూసేకరణకు సైతం అడ్డుపడ్డారు. ఇప్పుడు ఈ నివేదిక కూడా అందుకే వేశారు. ఈ నివేదికను పొలిటికల్ వ్యపన్ గా వాడుతున్నారు. చట్టపరిధిలో నిష్పక్షపాతంగా విచారణ జరపలేదు. మాకు 8బి క్రింద నోటీసులు ఇవ్వలేదు. ఘోష్ కమిషన్ నివేదిక చెల్లదు. గతంలో అనేక కమిషన్లు 8బి క్రింద నోటీసులు ఇవ్వకపోతే కోర్టులు నివేదికలను కొట్టివేశాయి. ఇది చెత్త రిపోర్టు, తప్పుడు రిపోర్టు అన్నారు. హరీష్ రావు మాట్లాడుతుండగా కల్పించుకున్న మంత్రి శ్రీధర్ బాబు కోర్టులో అన్ని విషయాలు త్వరలో తేలతాయన్నారు. కోర్టులో ఉన్న టెక్నికల్ అంశాలు గురించి మీరు మాట్లతున్నారు. అవి కోర్టు ముందు ఉన్నాయి. చట్టపరంగా తేలుతాయి. మేము అడుగుతున్నది కమిషన్ చూపించిన లోపాల గురించి మాత్రమే సభలో మాట్లాడండి అన్నారు. మా బాధ్యతలో భాగంగా సభలో నివేదిక పెట్టాము. పార్టీ పరంగా అనవసర విమర్శలు చేయొద్దన్నారు. మేము కేసీఆర్ ప్రభుత్వంపై కక్ష సాధించాలంటే పారదర్శకంగా కమిషన్ లు ఏర్పటు చేసేవాళ్లం కాదు. కమిషన్ నివేదిక పేరుతో రెండేళ్లు ఆగేవాళ్ల కాదన్నారు.తిరిగి మైక్ అందుకున్న హరీష్ రావు మాట్లడుతూ తెలంగాణ రైతుల కష్టాలు తీర్చే కాళేశ్వరం ప్రాజెక్టుపై వేసిన తప్పుడు నివేదిక ఇది. మేము రిపోర్టను క్వాష్ చేయమని మాత్రమే కోర్టుకు వెళ్లాము. అసెంబ్లీలో రిపోర్టు పెట్టొద్దని మేము వెళ్లలేదన్నారు. తుమ్మిడిహట్టి నుండి మేడిగడ్డకు ప్రాజెక్టు మార్చడం వెనుక కుట్ర ఉందని రిపోర్టులో చెబుతున్నారు. కానీ 120 టీఎంసీల నీళ్లు తుమ్మిడిహట్టి వద్ద లేవని సెంట్రల్ వాటర్ కమిషన్ లేఖ ఇచ్చింది. ఇది మా లబ్ధికోసం మార్చలేదని హరీష్ రావు స్పష్టం చేశారు.

# ఇంటింటికీ స్మార్ట్ రేషన్ కార్డులు

గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్‌తో కలిసి ఈ కార్యక్రమాన్ని ఆదివారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా లబ్ధిదారుల ఇళ్లకు స్వయంగా వెళ్లి మంత్రులు స్మార్ట్ కార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా సెప్టెంబర్ 15వ తేదీలోగా ప్రతి ఇంటికీ స్మార్ట్ కార్డుల పంపిణీ పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్డుల ద్వారా రాష్ట్రంలోని సుమారు నాలుగు కోట్ల మంది ప్రజలకు ప్రయోజనం చేకూరుతుందని ఆయన వివరించారు. గుంటూరు జిల్లాలో 5.85 లక్షల మందికి, ఒక్క తెనాలి నియోజకవర్గంలోనే 83 వేల మందికి ఈ కార్డులను అందిస్తున్నట్లు తెలిపారు. క్యూఆర్ కోడ్ సౌకర్యంతో కూడిన ఈ కార్డును స్కాన్ చేయడం ద్వారా లబ్ధిదారుడు సరుకులు తీసుకున్న వివరాలు వెంటనే ప్రభుత్వానికి చేరుతాయని, దీనివల్ల పంపిణీలో పారదర్శకత పెరుగుతుందని అన్నారు.

పోర్టబులిటీ విధానం ద్వారా రాష్ట్రంలో ఎక్కడైనా రేషన్ తీసుకునే వెసులుబాటు కల్పించామని గుర్తుచేశారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నాయకత్వంలో సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నామని మనోహర్ తెలిపారు. దీపం-2 పథకం కింద మహిళలకు ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్ల హామీని నిలబెట్టుకుంటున్నామని, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందేలా పార్టీలకు అతీతంగా పనిచేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. గత ప్రభుత్వ దుష్ప్రచారాలను ప్రజలు నమ్మవద్దని ఆయన కోరారు. రేషన్ పంపిణీకి సంబంధించి ఏమైనా సందేహాలుంటే టోల్ ఫ్రీ నంబర్ 1967కు ఫోన్ చేయవచ్చని సూచించారు. కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ, దేశంలోనే తొలిసారిగా ఆంధ్రప్రదేశ్‌లో స్మార్ట్ రేషన్ కార్డులను అమలు చేయడం గర్వకారణమన్నారు. సంక్షేమంతో పాటు అభివృద్ధికి కూడా కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని తెలిపారు. రూ.4 వేల పెన్షన్, తల్లికి వందనం కింద రూ.10 వేల కోట్లు, అన్నదాత సుఖీభవ ద్వారా రూ.3,175 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేసిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనని అన్నారు. అమరావతి, పోలవరం పనులతో పాటు రాష్ట్రవ్యాప్తంగా రోడ్ల నిర్మాణం, మరమ్మతులపై ప్రత్యేక దృష్టి సారించామని చెప్పారు. ఎన్నికల ముందు నందివెలుగు గ్రామానికి రావడానికి రోడ్లు అధ్వానంగా ఉండేవని, ఇప్పుడు తాము వేసిన రోడ్లతో అభివృద్ధి స్పష్టంగా కనిపిస్తోందని ఆయన వ్యాఖ్యానించారు.

## శ్రీ హరిచంద్ర పరపతి సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక.. అధ్యక్షుడిగా తోట ప్రకాశ్

న్యూ శాయంపేట : శ్రీ హరిచంద్ర పరపతి సంఘం నూతన కార్యవర్గం ఎంపిక ప్రక్రియ పూర్తయింది. హనుమకొండ పద్మాక్షి రోడ్‌లోని మున్నూరుకాపు భవనంలో ఆదివారం సమావేశమైన సభ్యులు అధ్యక్షులుగా తోట ప్రకాష్ , ప్రధాన కార్యదర్శిగా కనుకుంట్ల రవికుమార్ ను ఎన్నుకున్నారు.

సంఘం కోశాధికారిగా దొమ్మటి భాస్కర్ ఉపాధ్యక్షులుగా తుమ్మేటి బుచ్చిరాజు, సహాయ కార్యదర్శిగా మక్కల దేవదాస్ ఎంపికయ్యారు. ఆడిటర్‌గా దేవులపల్లి సంపత్, కార్యవర్గ సభ్యులుగా గిరి రాజయ్య, తోట శ్రీనివాస్, తుమేటి సదానందం, అరసం కృష్ణమూర్తి, గోదాసు శ్రీనివాస్‌లు ఎంపిక అయ్యారని సంఘం ప్రతినిధులు వెల్లడించారు.

# బీసీలకు 42 శాతం రిజర్వేషన్ బిల్లులు ఆమోదం

తీవ్ర వాదోపవాదాల నడుమ తెలంగాణ మున్సిపాలిటీల (మూడవ సవరణ) బిల్లు-2025, తెలంగాణ పంచాయతీరాజ్ (మూడవ సవరణ) బిల్లు-2025లను సభ వాయిస్ ఓటు ద్వారా ఆమోదించింది. ఈ సందర్భంగా అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీల మధ్య మాటల యుద్ధం నడిచింది. అసెంబ్లీ సమావేశాల రెండో రోజున ప్రభుత్వం ఈ రెండు బిల్లులను సభ ముందుకు తెచ్చింది. స్థానిక సంస్థల్లో మొత్తం రిజర్వేషన్లపై ఉన్న 50 శాతం పరిమితిని తొలగించి, బీసీలకు 42 శాతం కోటా కల్పించడమే ఈ బిల్లుల ముఖ్య ఉద్దేశం. చర్చ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వమే బీసీ రిజర్వేషన్ల పెంపునకు ప్రధాన అడ్డంకిగా మారిందని ఆరోపించారు. బీఆర్ఎస్ హయాంలో చేసిన పంచాయతీరాజ్ చట్టం-2018, మున్సిపాలిటీల చట్టం-2019 వల్లే రిజర్వేషన్లు 50 శాతానికి మించలేని పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు. బీసీల సాధికారతకు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అడ్డంకులు సృష్టిస్తున్నారని ఆయన దుయ్యబట్టారు. మరోవైపు బీఆర్ఎస్ నేతలు ప్రభుత్వ చిత్తశుద్ధిని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్ల విషయంలో ప్రభుత్వానికి నిజాయతీ లేదని ఆరోపించారు. 42 శాతం రిజర్వేషన్ల కోసం మార్చిలో ఆమోదించిన బిల్లులకు రాష్ట్రపతి ఆమోదం పొందడానికి ఢిల్లీకి అఖిలపక్షాన్ని ఎందుకు తీసుకెళ్లలేదని ప్రశ్నించారు. బీఆర్ఎస్ నేత కేటీఆర్ మాట్లాడుతూ ఈ అంశంపై లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ పార్లమెంటులో ఎందుకు మౌనంగా ఉన్నారని నిలదీశారు. ఈ ఆరోపణలపై సీఎం రేవంత్ రెడ్డి స్పందిస్తూ తమ ప్రభుత్వం బీసీ రిజర్వేషన్ల కోసం నిరంతరం కృషి చేస్తోందన్నారు. హైకోర్టు ఆదేశాల మేరకు డెడికేటెడ్ కమిషన్‌ను ఏర్పాటు చేసి, కులగణన సర్వే నిర్వహించామని తెలిపారు. ఆ నివేదిక ఆధారంగానే మార్చిలో రెండు బిల్లులను ఆమోదించి గవర్నర్‌కు పంపామని, అవి గత ఐదు నెలలుగా రాష్ట్రపతి వద్ద పెండింగ్‌లో ఉన్నాయని వివరించారు. ఈలోగా ఆర్డినెన్స్ తీసుకురావాలని ప్రయత్నిస్తే, ప్రతిపక్షం గవర్నర్‌ను ప్రభావితం చేసి అడ్డుకుందని ఆరోపించారు. ప్రధాని మోదీ అపాయింట్‌మెంట్ కోసం ఐదుసార్లు లేఖలు రాసినా స్పందన లేదని, అపాయింట్‌మెంట్ ఇప్పించేందుకు సాయం చేయాలని బీజేపీ ఫ్లోర్ లీడర్ పాయల్ శంకర్‌ను కోరారు. బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను కచ్చితంగా అమలు చేస్తామని హామీ ఇచ్చారు.

# చైనాతో స్నేహమా.?

ప్రభుత్వంపై కాంగ్రెస్ పార్టీ తీవ్ర స్థాయిలో విరుచుకుపడింది. చైనా పట్ల మోదీ సర్కార్ అనుసరిస్తున్న మెతక వైఖరిని ఎండగడుతూ, దేశ భద్రత విషయంలో రాజీ పడుతున్నారంటూ తీవ్ర ఆరోపణలు చేసింది. చైనా దూకుడుకు, బెదిరింపులకు తలొగ్గడమే భారత కొత్త భద్రతా విధానమా అని సూటిగా ప్రశ్నించింది. కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ జైరాం రమేశ్ 'ఎక్స్' వేదికగా ప్రభుత్వ విధానాలను తప్పుబట్టారు. 2020 జూన్‌లో గల్వాన్ లోయలో 20 మంది భారత సైనికులు ప్రాణత్యాగం చేసిన విషయాన్ని గుర్తుచేస్తూ, ఆ త్యాగాలను విస్మరించి చైనాతో రాజీకి ప్రయత్నించడం దారుణమని విమర్శించారు. "చైనా దురాక్రమణను గుర్తించడానికి బదులుగా, ప్రధాని మోదీ వారికి క్లీన్ చిట్ ఇచ్చారు" అని ఆయన ఆరోపించారు. సరిహద్దుల్లో యథాతథ స్థితిని పూర్తిగా పునరుద్ధరించాలని ఆర్మీ చీఫ్ కోరుతున్నప్పటికీ, ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోకుండా చైనాతో సయోధ్యకు మొగ్గుచూపడం వారి దురాక్రమణను చట్టబద్ధం చేయడమేనని అన్నారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్థాన్‌తో చైనా కుమ్మక్కైన తీరును మన ఆర్మీ డిప్యూటీ చీఫ్ లెఫ్టినెంట్ జనరల్ రాహుల్ సింగ్ జూలై 4న స్పష్టంగా వివరించారని జైరాం రమేశ్ గుర్తుచేశారు. "ఈ అపవిత్ర పొత్తుపై స్పందించాల్సింది పోయి, మోదీ ప్రభుత్వం దానిని మౌనంగా అంగీకరించి ఇప్పుడు చైనాకు రాచమర్యాదలు చేస్తోంది" అని ఆయన ఆక్షేపించారు. దేశీయంగా చైనా ఉత్పత్తుల డంపింగ్ విపరీతంగా పెరిగిపోయిందని, దీనివల్ల దేశంలోని చిన్న, మధ్య తరహా పరిశ్రమలు తీవ్రంగా దెబ్బతింటున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. యార్లంగ్ త్సాంగ్పో (బ్రహ్మపుత్ర) నదిపై చైనా నిర్మిస్తున్న భారీ హైడల్ ప్రాజెక్టు వల్ల ఈశాన్య రాష్ట్రాలకు తీవ్ర ముప్పు ఉన్నప్పటికీ, ప్రభుత్వం ఆ విషయంపై ఒక్క మాట కూడా మాట్లాడకపోవడాన్ని ఆయన తీవ్రంగా తప్పుపట్టారు. కాగా, ఇరు దేశాల మధ్య ఆర్థిక పురోగతి కోసం స్థిరమైన, స్నేహపూర్వక సంబంధాలను నిర్మించుకోవాలని మోదీ, జిన్‌పింగ్ తమ భేటీలో నిర్ణయించుకున్నట్లు అధికారిక వర్గాలు తెలిపాయి.

# మరింత పెరగనున్న హైదరాబాద్ విస్తీర్ణం

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) హైదరాబాద్ భవిష్యత్ వృద్ధిని దృష్టిలో పెట్టుకొని దాదాపు 30 వేల ఎకరాల భూమి అవసరమని హెచ్ఎండీఏ కమిషనర్, హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్ ఎండీ సర్ఫరాజ్ అహ్మద్ ఇటీవల వెల్లడించారు. ఆయన ఢిల్లీలో జరిగిన నరెడ్కో (నేషనల్ డెవలప్మెంట్ రియల్ ఎస్టేట్ కౌన్సిల్) సదస్సులో మాట్లాడుతూ నగరాన్ని దీర్ఘకాలికంగా విస్తరించేందుకు పక్కా ప్రణాళికలతో ముందుకు వెళ్తున్నామని వివరించారు. మాస్టర్ ప్లాన్%-%2050 రూపకల్పన ప్రస్తుతం జరుగుతోందని ఇందులో నగర అభివృద్ధి, పారిశ్రామిక జోన్లు, నివాస అవసరాలు, రవాణా సదుపాయాలు అన్నీ సమగ్రంగా చేర్చుతున్నట్లు ఆయన తెలిపారు. తొలి దశలోనే వెయ్యి ఎకరాల భూసేకరణ అవసరమని ఇప్పటికే సంబంధిత నోటిఫికేషన్లు జారీ చేశామని చెప్పారు.

### రీజినల్ రింగ్ రోడ్డు ప్రాజెక్ట్..

హైదరాబాద్ రవాణా వ్యవస్థను మరింత సులభతరం చేసేందుకు రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్) అత్యంత కీలకం కానుంది. ఇది 350 కిలోమీటర్ల పరిధిలో నిర్మించబడి, ఎన్‌హెచ్‌లను అనుసంధానించి, బయటి జిల్లాలకు వేగవంతమైన రాకపోకలు కల్పిస్తుంది. ఈ రోడ్డు పూర్తయితే రాజధాని నగరంపై ఉన్న ట్రాఫిక్ ఒత్తిడి తగ్గడమే కాకుండా, పరిశ్రమల స్థాపన, గోదాములు, లాజిస్టిక్స్ హబ్‌ల అభివృద్ధికి పెద్ద ఊతమిస్తుంది. మల్టీమోడల్ ట్రాన్స్‌పోర్ట్ సిస్టమ్‌తో ఈ ప్రాజెక్ట్ సమన్వయం చేయబడుతుందని అధికారులు చెబుతున్నారు.

### ఫోర్త్ సిటీ ఆవిష్కరణ..

హైదరాబాద్ ఇప్పటికే ఐటీ హబ్‌గా గ్లోబల్ స్థాయిలో గుర్తింపు పొందిన విషయం తెలిసిందే. అయితే ఈ వృద్ధి మరింత విస్తరించేందుకు 'ఫోర్త్ సిటీ'(ఫ్యూచర్ సిటీ) అనే కాన్సెప్ట్‌పై ప్రభుత్వం దృష్టి సారించింది. ఇప్పటి వరకు హైదరాబాద్ పరిధిలో హైటెక్ సిటీ, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, ఫార్మా సిటీ ప్రధాన కేంద్రాలుగా ఉన్నాయి. ఇకపై ఫోర్త్ సిటీ రూపకల్పన ద్వారా ఐటీ, బయోటెక్, ఎడ్యుకేషన్, స్టార్ట్-అప్ లాబ్‌లు, గ్రీన్ ఎనర్జీ హబ్‌లను ఒకేచోట కలిపే ప్రణాళిక ఉందని సమాచారం. ఇది పూర్తయితే.. లక్షలాది ఉద్యోగ అవకాశాలు సృష్టించబడటమే కాకుండా హైదరాబాద్‌ను సస్టైనబుల్ స్మార్ట్ సిటీ మోడల్గా నిలబెట్టనుంది.

### సమగ్ర అభివృద్ధి దిశగా అడుగులు..

హైదరాబాద్ విస్తరణలో రోడ్లతో పాటు పర్యావరణ పరిరక్షణ, తాగునీరు, డ్రైనేజీ వ్యవస్థ, మెట్రో కనెక్టివిటీ కూడా మాస్టర్ ప్లాన్‌లో భాగమని అధికారులు పేర్కొన్నారు. భవిష్యత్తులో జనాభా పెరుగుదలను దృష్టిలో పెట్టుకొని, ఆధునిక పార్కులు, ఆవాస సముదాయాలు, పారిశ్రామిక హబ్‌లు, విద్యా సంస్థలు సమన్వయంతో ఏర్పాటు చేయనున్నారు.

# ధవళేశ్వరం వద్ద గోదావరి ఉగ్రరూపం

వద్ద 12.70 అడుగుల స్థాయికి వరద చేరింది. దీంతో ఇక్కడ రెండో ప్రమాద హెచ్చరిక జారీచేశారు అధికారులు బ్యారేజ్ అన్నిగేట్లు ఎత్తి దిగువకు సముద్రంలోకి 11.24 లక్షల క్యూసెక్కుల వరద నీటిని వదులుతున్నారు జలవనరుల శాఖ అధికారులు.

### నెల రోజుల వ్యవధిలో మూడోసారి..

గోదావరికి నెల రోజుల వ్యవధిలో మూడోసారి వరద పోటెత్తిన పరిస్థితి తలెత్తింది, ముఖ్యంగా మహారాష్ట్ర, తెలంగాణా తదితర ప్రాంతాల్లో భారీ వర్షాల కారణంగా గోదావరికి వరద నీరు భారీగా వచ్చి చేరుతోంది దీంతో మూడు దఫాలుగా వరదలు పోటెత్తాయి, దాదాపు ఈ నెల రోజుల వ్యవధిలో దిగువకు 3 కోట్ల క్యూసెక్కుల వరద నీరు సముద్రంలోకి వృధా పోయినట్లు అంచనా ఉంది తాజాగా వరదలు పోటెత్తుతుండడంతో రోజుకు 10 లక్షల క్యూసెక్కులకు మించి వరద నీరు సముద్రంలోకి వదులుతున్నారు.

### లంక గ్రామాల ప్రజలకు తప్పని అవస్థలు..

గోదావరికి వరదలు పోటెత్తిన ప్రతీ సారి లంక గ్రామాల ప్రజలు అవస్థలు షరా మూమూలుగా మారుతున్న పరిస్థితి ఉంటుంది, ముఖ్యంగా ధవళేశ్వరం దిగువన ఉన్న నదీపరివాహక ప్రాంతాల ప్రజలు బాధలు వర్ణణాతీతం, ధవళేశ్వరం బ్యారేజ్ దిగువన ఉన్న గౌతమి, వశిష్ట, వైనతేయ నదీపాయలు పోటెత్తి ప్రవహిస్తున్నాయి, దీంతో లంక గ్రామాల్లోకి వరద నీరు చేరి రాకపోకలు స్తంభిస్తున్నాయి, ఇప్పటికే అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో పి.గన్నవరం నియోజకవర్గంలో పి.గన్నవరం, అయినవిల్లి లంక మండలాల్లో 28 లంక గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. వీరంతా ఇంజను పడవల్లో రాకపోకలు సాగిస్తున్నారు అదేవిధంగా రాజోలు, ముమ్మిడివరం నియోజకవర్గంతోపాటు పుదుచ్చేరీ యానాంలో కూడా వరద వల్ల ఇబ్బందులు తప్పడంలేదు.

### గణేష్ నిమజ్జనాలతో అధికారులు అప్రమత్తం..

గణపతి విగ్రహాల నిమజ్జనం సందర్భంగా ప్రతీ ఏటా గోదావరి లో గల్లంతయ్యి కొందరు మృత్యువాత పడుతున్న పరిస్థితి కలుగుతోంది, ఈఏడాది గోదావరి పాయల్లో వరద నీరు భారీగా పోటెత్తడంతో నిమజ్జనాల సందర్భంగా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అధికారులు అప్రమత్తం అయ్యారు. నిమజ్జనాలు కేవలం పోలీసులు నిర్దేశించిన స్థలాల్లోనే చేయాలని ఆదేశాలు జారీచేశారు. అంతే కాకుండా ఉత్సవ కమిటీలు పలు జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరిస్తున్నారు.

## డ్యామ్‌కు, బ్యారేజీకి తేడా లేకుండా

# కాళేశ్వరం నిర్మాణం

కుమార్ రెడ్డి రూ. 21 వేల కోట్లతో కట్టిన మేడిగడ్డ బ్యారేజీ, పంప్ హౌస్‌లు 20 నెలల నుంచి నిరుపయోగంగా ఉండటం దురదృష్టకరం అన్నారు. డ్యామ్‌కు, బ్యారేజ్‌కు తేడా లేకుండా కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణ పనులు చేశారని ఎన్‌డీఎస్ఏ నివేదికలో ఉందని మంత్రి ఉత్తమ్ పేర్కొన్నారు.

### లక్ష కోట్ల ఖర్చు.. లక్ష ఎకరాలకు నీళ్లు రాలేదు

కాళేశ్వరం ప్రాజెక్టుపై తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ సమర్పించిన నివేదికను మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అసెంబ్లీలో ప్రవేశపెట్టి చర్చ ప్రారంభించారు. ఎనభై ఏడు వేల కోట్లు ఖర్చు చేసినా గత బీఆర్ఎస్ ప్రభుత్వం లక్ష ఎకరాలకు సైతం నీళ్లు ఇవ్వలేకపోయిందని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు గుండెకాయ లాంటి మేడిగడ్డ బ్యారేజీ దెబ్బతింది. కట్టిన తరువాత తక్కువ కాలానికే బ్యారేజీ పిల్లర్లు కుంగిపోయాయి. బ్యారేజ్‌లకు జరిగిన నష్టం రాష్ట్ర ప్రజలకు పెనుభారంగా మారింది. ప్రజా ధనం వృథా అయిందన్నారు.

### కాంగ్రెస్ ప్రభుత్వాలు కీలక ప్రాజెక్టులు నిర్మించాయి

కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించింది. 2004 నుంచి 2014 వరకు అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ అంబేద్కర్ ప్రాణహిత చేవెళ్ల సుజల స్రవంతి స్కీమ్, మహాత్మ జ్యోతిబాపులే దుమ్ముగూడెం, నెహ్రూ నెట్టెంపాడు లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్, రాజీవ్ బీమా లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్, జె చొక్కారావు దేవాదుల ఎత్తిపోతల పథకం లాంటి ప్రాజెక్టులు కాంగ్రెస్ చేపట్టింది. కానీ బీఆర్ఎస్ హయాంలో కట్టిన మేడిగడ్డ వద్ద బ్యారేజీ కట్టాలని డీపీఆర్ లో లేదని ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. వ్యాప్కోస్ రిపోర్ట్ రాకముందే మేడిగడ్డ బ్యారేజీ నిర్మాణం నిర్ణయం తీసుకున్నారు. డీపీఆర్ 17 జనవరి 2016న ఇచ్చింది. అదేరోజు అప్పటి సీఎం కేసీఆర్ మేడిగడ్డ వద్ద బ్యారేజీ కట్టేందుకు అంచనాలు వేయాలని అధికారులను ఆదేశించారు.

### ప్రాణహిత ఖర్చు రూ.38 వేల కోట్లు, కాళేశ్వరం మొత్తం ఖర్చు లక్ష కోట్లపైమాటే

ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టుకు రూ.38,500 కోట్లు అంచనా అయితే బీఆర్ఎస్ ప్రభుత్వం మాత్రం మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను 80 వేల కోట్లతో కాళేశ్వరం ప్రాజెక్టు పనులు మొదలుపెట్టింది. ఇప్పుడు రిపోర్ట్ ప్రకారం 2022లో కాళేశ్వరం ప్రాజెక్టు ఖర్చు రూ.1 లక్షా 27 వేల కోట్లు. ఆ తరువాత కాళేశ్వరం ఖర్చు రూ.1 లక్షా 47 వేల కోట్లు అవుతాయని స్పష్టమవుతోంది. రూ.38 వేల కోట్లతో ముగిసిపోవాల్సిన ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టును ఏకంగా రూ.1 లక్షా 47 వేల కోట్లకు తీసుకెళ్లిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదే. మేడిగడ్డలో 6 పిల్లర్లు కుంగిపోయాయి. ఆ మూడు బ్యారేజీలతో 2019 నుంచి 2023 వరకు 162 టీఎంసీల నీళ్లు మాత్రమే ఎత్తిపోశారు. ఏడాదికి 20 టీఎంసీలే లిఫ్ట్ చేశారు. లక్ష కోట్లు ఖర్చు చేసినా లక్ష ఎకరాలకు నీళ్లు అందలేదని ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు.ఏడాదికి 190 టీఎంసీలు ఎత్తిపోస్తామని చెప్పి నాలుగైదేళ్లు కలిపి 162 టీటఎంసీలు మాత్రమే లిఫ్ట్ చేశారు. ఇందులో 32 టీఎంసీలు సముద్రంలోకి వృథాగా వదిలారు. అంటే లిఫ్ట్ చేసింది 130 టీఎంసీలు 10 శాతం ఎవాపరేషన్ లాస్ తీసివేస్తే నెట్ వాటర్ 114 టీఎంసీలు మాత్రమే. ఇందులో 13 టీటంసీలు కొండపోచమ్మ, రంగనాయక సాగర్, మల్లన్న సాగర్లో స్టోరేజీ ఉన్నాయి. తెలంగాణ ప్రజలకు ఉపయోగపడింది 101 టీఎంసీలు. ఏడాదికి 20.2 టీఎంసీలు మాత్రమే రైతులకు వినియోగంలోకి వచ్చాయి. 38 వేల కోట్ల ప్రాణహితను పక్కనపెట్టి 1 లక్షా 47 వేల కోట్లకు ఖర్చుకు కాళేశ్వరాన్ని చేపట్టారు.

# కాళేశ్వరం కట్టినందుకు వీళ్లను ఉరితీయాలి

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** మాజీ మంత్రి హరీష్ రావు తెలంగాణ అసెంబ్లీలో పదే పదే తప్పుడు సమాచారం చెబుతున్నారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విమర్శించారు. తుమ్మిడిహట్టి వద్ద నీటి లభ్యత ఉందని కేంద్ర ప్రభుత్వం పేర్కొందని తెలిపారు. 2009, 2014లో నీళ్లు అందుబాటులో ఉన్నాయని కేంద్రం లేఖలలో స్పష్టంగా చెప్పిందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం రోజున శాసనసభలో కాళేశ్వరం ప్రాజెక్టుపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదికను ప్రవేశపెట్టింది. అనంతరం ఆ నివేదికపై సభలో చర్చ జరిగింది. ముందుగా సభలో నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చర్చను ప్రారంభించగా, ఆ తర్వాత హరీష్ రావుకు మాట్లాడే అవకాశం కల్పించారు. ఈ క్రమంలోనే హరీష్ రావు మాట్లాడుతూ పీసీ ఘోష్ ఎఫెక్ట్ పీపుల్ అయిన తమ హక్కులను కాలరాశారని ఆరోపించారు. తమకు 8బీ కింద నోటీసులు ఇవ్వలేదని తమపై చేయబోతున్న ఆరోపణల గురించి ఆ వివరాలు చెప్పి, దానిపై తమ వివరణ తీసుకోవాల్సిన బాధ్యత ఆయనపై ఉందని అన్నారు. అలాగే గతంలో పలువురు నాయకులకు 8బీకి సంబంధించి నోటీసులు ఇవ్వకపోవడంపై కోర్టులు ఆగ్రహం వ్యక్తం చేశాయని చెప్పారు.అయితే ఈ క్రమంలోనే హరీష్ రావు సబ్జెక్ట్‌కు పరిమితం కావాలని, నివేదికలోని అంశాలకు పరిమితం కావాలని మంత్రులు కోరారు. హరీష్ రావుకు ఇచ్చిన అరగంట సమయంలో మాట్లాడాలని సూచించారు. అయితే ఈ క్రమంలోనే హరీష్ రావు మాట్లాడుతూ ప్రభుత్వం బురద రాజకీయాలు చేస్తుందని, కక్షపూరితంగా వ్యవహరిస్తుందని తీవ్ర ఆరోపణలు చేశారు. కావాలనే ఆదివారం రోజున శాసనసభ సమావేశాలు నిర్వహించారని, అయితే తాను పూర్తి ప్రిపేర్ అయి ఉన్నానని, నాలుగు రోజులైనా మాట్లాడగలనని చెప్పారు.ఇలా హరీష్ రావు వర్సెస్ మంత్రుల మధ్య మాటల యుద్ధం కొనసాగింది. ఈ క్రమంలోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ అసంపూర్తి సమాచారంతో హరీష్ రావు తెలంగాణ సమాజాన్ని తప్పుదోవ పట్టించాలని ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ప్రాణహిత - చేవెళ్లకు సంబంధించి తుమ్మిడిహట్టి నీరు అందుబాటులో ఉందని కేంద్రం పేర్కొందని తెలిపారు. హైడ్రాలజీ అనుమతులు ఇస్తున్నామని ఆనాటి కేంద్ర మంత్రి ఉమా భారతి 2014 అక్టోబర్ 24న స్పష్టంగా చెప్పారని తెలిపారు. 205 టీఎంసీల నీరు అందుబాటులో ఉందని లెటర్ రాస్తే అప్పటి నీటి పారుదల శాఖ హరీష్ రావు మాత్రం మళ్లీ పరిశీలించాలని లేఖ రాశారని విమర్శించారు. ఒకసారి ఎమ్మెల్యేగా గెలిచి సర్టిఫికెట్ తీసుకున్నాక మళ్లీ పరిశీలించాలని ఎవరైనా అడుగుతారా? అని సీఎం రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. 2009లో కూడా కేంద్రంలో కూడా ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం నీరు అందుబాటులో ఉందని అనుమతి ఇచ్చిందని చెప్పారు. ఈ రికార్డులను కావాలనే ఆనాటి బీఆరెస్ ప్రభుత్వం తొక్కిపెట్టిందని మండిపడ్డారు. పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన రిపోర్టులో వాస్తవాలని బయటపెట్టారనే వారిపై విషం చిమ్ముతున్నారని విమర్శించారు. హరీష్ రావు తప్పు చేశారని నివేదికలోని పేజీ నెంబర్ 98 లో స్పష్టంగా పొందుపరిచారని అన్నారు. సీబీఐ కావాలా?, సీబీ సీఐడీ కావాలా?, ఏ విచారణ కావాలో చెప్పకుండా తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. అసంపూర్తి సమాచారంతో తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేసిన హరీష్ రావు వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించాలని కోరారు.అయితే ఈ సందర్భంగా హరీష్ రావు స్పందిస్తూ ఉమాభారతి లెటర్‌లోని మొదటి పేజీ వరకే చదివి సీఎం రేవంత్ రెడ్డి సభను తప్పు దారి పట్టించే యత్నం చేస్తున్నారని ఆరోపించారు.

మూడో పేజీలో నీటి లభ్యత లేదు అని పేర్కొన్నారని చెప్పుకొచ్చారు. ఈ క్రమంలోనే మరోసారి సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ ప్రాణహిత చేవెళ్లలో 205 టీఎంసీల నీళ్లు ఉన్నాయని అప్పటి కేంద్ర మంత్రి ఉమాభారతి లేఖలో పేర్కొన్నారని తెలిపారు. నీళ్లు ఉన్నాయని కేంద్రం లేఖ రాసిందని? ఈ మాటను అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఎందుకు పట్టించుకోలేదని ప్రశ్నించారు. బీఆర్ఎస్ వాళ్లకు తప్పుడు ఉద్దేశం ఉంది కాబట్టే కేంద్ర మంత్రి లేఖ రాసినా పట్టించుకోలేదని విమర్శించారు. రికార్డులను తొక్కిపెట్టి ప్రాజెక్టు పేరు మార్చి,ఊరు మార్చి లక్ష కోట్లు తెలంగాణ సొమ్మును దోచుకోవాలని అనుకున్నారని ఆరోపించారు. తుమ్మిడిహట్టికి సంబంధించి మహారాష్ట్రతో చర్చల్లో అనుమతి ఇవ్వమని చెప్పలేదని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ముంపు ప్రాంతం తగ్గించేందుకు 148 మీటర్ల ఎత్తులో ప్రాజెక్టు కట్టాలని మాత్రమే మహారాష్ట్ర ప్రభుత్వం చెప్పిందని తెలిపారు. 80వేల పుస్తకాలు చదివిన మేధావి మెదడును పురుగు తొలచిందని అన్నారు. నిజాం కంటే శ్రీమంతుడు కావాలని కేసీఆర్ అనుకున్నారని ఆరోపించారు. మహారాష్ట్రతో చర్చలకంటే ముందే మేడిగడ్డ వద్ద కట్టాలని కేసీఆర్ నిర్ణయం తీసుకున్నారని ఆరోపించారు. హరీష్ రావు తప్పు చేశారని పీసీ ఘోష్ కమీషన్ నివేదికలో చెప్పిందని దీంతో హరీష్ రావు విషం చిమ్ముతున్నారని సీఎం రేవంత్ రెడ్డి మండిపడ్డారు. చర్చను తప్పుదోవ పట్టించాలని హరీష్ రావు చూస్తున్నారని విమర్శించారు. హరీష్ రావు సత్యహరిశ్చంద్రుడు కాబట్టి ఎలాంటి విచారణ కావాలో చెప్పాలని ఎద్దేవా చేశారు.

## మనువరాలు పుట్టినరోజున 'మౌస్డీర్' దత్తత..

## జూ సిబ్బందికి చెక్ అందించిన లయన్ గిల్లా పురుషోత్తం

న్యూ శాయంపేట: వన్యప్రాణుల సంరక్షణలో 'నేను సైతం' అంటూ అందరికీ ఆదర్శంగా నిలిచారు లయన్ గిల్లా పురుషోత్తం . తమ మనువరాలు రాణీ సుమేధ పుట్టిన రోజున ఆయన కాకతీయ జూలాజికల్ పార్కులోని 'మౌస్డీర్'ను దత్తత తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన 12వేల రూపాయల చెక్కును జూ సిబ్బందికి అందచేశారు. చెక్కు ప్రదానం అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతినెల మౌస్డీర్ పోషణకు అయ్యే ఖర్చును తాము అందచేస్తామని, జంతుప్రేమికులుగా ఇలాంటి పని చేయడం ఎంతో సంతృప్తిని, సంతోషాన్ని ఇస్తోందని తెలిపారు. మౌస్డీర్‌ను దత్తత తీసుకున్న ఆయనను జూ సిబ్బంది అభినందించారు. ఈ కార్యక్రమంలో లయన్స్?? క్లబ్ హనుమకొండ అధ్యక్షుడు తేరాల రమేష్ బాబు, వివేకానంద, శ్రీధర్ రెడ్డి, నిర్మల, రమణరెడ్డి, సుభాష్, శ్రీనివాసులు, రాజశేఖరం, అశోక్, ప్రభాకర్, కిరణ్మయి, మోహన్ రెడ్డి, ప్రభాకర్, విశ్వేశ్వర్, ఆర్ఎఫ్‌వో, అటవీ సిబ్బంది పాల్గొన్నారు.

# అపూర్వ కలయిక..!

## 50 ఏళ్ల తర్వాత స్నేహితుల సమ్మేళనం..!!

**- వేములవాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల 1975-76 పూర్వ విద్యార్థుల ఘనంగా గోల్డెన్ జూబ్లీ వేడుకలు**



వేములవాడ (ప్రశ్న న్యూస్) ఒకటి కాదు,రెండు కాదు, సగం శతాబ్దం తర్వాత! చిన్ననాటి స్నేహితులు మళ్లీ ఒకే వేదికపై కలుసుకున్నారు. వేములవాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల 1975-76 విద్యాసంవత్సరం పూర్వ విద్యార్థుల గోల్డెన్ జూబ్లీ సమ్మేళనం ఆదివారం గతస్మృతుల సాక్షిగా



ఘనంగా జరిగింది.ఆ రోజుల్లో చదివిన తరగతి గది,పాఠశాల ప్రాంగణం,మళ్లీ ఆటలతో, నవ్వులతో,జ్ఞాపకాలతో కిక్కిరిసింది. అప్పుడు 160 మంది విద్యార్థులు ఉండగా,ఆదివారం జరిగిన ఈ వేడుకకు దాదాపు 70 మంది హాజరయ్యారని నిర్వాహకులు తెలిపారు. కళ్లలో తేమ, పెదవులపై చిరునవ్వులు%ౌ% పాత జ్ఞాపకాలతో మధుర క్షణాలతో గడిపారు.

### "పాఠశాలలు సమాజానికి పునాది"

పూర్వ విద్యార్థి,జనశక్తి నాయకుడు కూర దేవేందర్ అలియాస్ అమర్ మాట్లాడుతూ – "ఆనాటి ప్రభుత్వ పాఠశాలలు అన్ని వర్గాల వారికి విద్యా పునాది వేశాయి. ఈ వేదిక మళ్లీ బాల్యాన్ని గుర్తు చేసింది.నేటి ఆధునిక యుగంలో యువత మత్తు పదార్థాల బారిన పడుతున్నారు. వారిని సరైన మార్గంలో నడిపించాల్సిన బాధ్యత మన అందరిదీ. విద్యే మనిషి ఔన్నత్యానికి నిదర్శనం." అని అన్నారు.

### గురువుల సత్కారం - కృతజ్ఞతల పూలమాలలు

విద్యాబుద్ధులు నేర్పిన గురువులను పూర్వ విద్యార్థులు ఘనంగా సత్కరించారు. వాసాలమర్రి విట్టల్, ఎల్. నారాయణరావు, నరాల వెంకటేశం, ఎం. దేవేంద్రం, సాంబశివరావులకు పూలమాలలు వేసి కృతజ్ఞతలు తెలిపారు.

### అందరినీ ఆకట్టుకున్న స్మృతిసమ్మేళనం

ఈ వేడుకలో న్యాయవాదులు నర్సింగారావు ,రేగుల దేవేందర్, ఎక్సైజ్ రిటైర్డ్ సీఐ చంద్రశేఖర్, రిటైర్డ్ ఉపాధ్యాయులు ఇప్పపూల దేవేందర్, రామశాస్త్రి రాములు, కటకం మల్లేశం, హరిబాబు, వారాల దేవయ్య, అలాగే రమేష్, చీకోటి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## చిన్నక్రాంతి కాలనీ కమిటీ ఆధ్వర్యంలో వైభవంగా గణపతి హెూమం, అన్నప్రసాద వితరణ



మేడిపల్లి(ప్రశ్న న్యూస్) గణపతి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ చెంగిచెర్ల చిన్న క్రాంతి కాలనీలో నిలుగొండ వరలక్ష్మి వెంకటేష్ గౌడ్, సుల్వ సుమలత రవీందర్ల ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ అన్నప్రసాద కార్యక్రమంలో, స్థానిక కాలనీల ప్రజలు,వివిధ పార్టీల నాయకులు భారీ సంఖ్యలో



పాల్గొన్నారు.ఉదయం గణపతి హెూమం ను ఎంతో వైభవంగా కన్నులవిందుగా నిర్వహించి,మధ్యాహ్నం అన్నప్రసాద కార్యక్రమం నిర్వహించడం చాలా సంతోషంగా ఉంది.గణపతి ఆశీస్సులు ప్రజల అందరిపైనా ఉండాలని చిన్న క్రాంతి కాలనీ కమిటీ ఆ భగవంతున్ని కోరారు. రానున్న కాలంలో మరెన్నో సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు కాలనీ కొరకు చేపడతామని కమిటీ సభ్యులు తెలిపారు. దీనికి సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు.

## గణేష్ మండపాలను దర్శించిన ఎన్ వి ఎస్ ఎస్ ప్రభాకర్



నాచారం (ప్రశ్న న్యూస్)నాచారం డివిజన్ లోని వివిధ కాలనీ ల లో బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎన్ వి ఎస్ ఎస్ ప్రభాకర్ గణేష్ మండపాలు సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా అధికార ప్రతినిధి పోతగాని గోపాల్ గౌడ్, డివిజన్ అధ్యకుడు కొమ్మగల్ల నవీన్, సినియర్ నాయకులు రాజిరెడ్డి, గందమల్ల గోపి,మోర నర్సింహారెడ్డి, రమేష్, సురేందర్ స్వామి, శేఖర్ గుప్తా,వేణుగోపాల్,దయాగౌడ్, ఉదయ్ కిరణ్ రెడ్డి,డివిజన్ మహిళా మోర్చా అధ్యక్షురాలు మంజులవాని, కళావతి, అసోసియేషన్ సభ్యులు, బిజెపి నాయకులు, కార్యకర్తలు, కాలనీవాసులు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

# ఘనంగా నిమజ్జన వేడుకలు



నాచారం(ప్రశ్న న్యూస్) ఒమేగా కళాశాలలో వినాయక చవితి సందర్భంగా వినాయక విగ్రహాలను ప్రతిష్టించి విద్యార్థిని విద్యార్థులు భక్తి శ్రద్ధలతో వైభవంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. మూడు రోజుల పాటు పూజలు నిర్వహించిన అనంతరం ఘనంగా గణపతి నిమజ్జనం చేశారు. కళాశాల



బృందం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసినటువంటి నిమజ్జనం శోభయాత్రలో విద్యార్థిని విద్యార్థులు ఆటపాటలతో డాన్సులతో కోలాటాలాడుతూ వివిధ వేషధారణలో ప్రదర్శనలు చేస్తూ స్వామివారికి ఘనంగా వీడ్కోలు పలికారు. విద్యార్థిని విద్యార్థుల ఆటపాటలు ఎంతగానో ఆకట్టుకున్నాయి.

## బీఆర్ఎస్ నేతలకు ఆది శ్రీనివాస్‌పై విమర్శించే స్థాయి లేదు

**- వేములవాడ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు : చంద్రగిరి శ్రీనివాస్ గౌడ్**



వేములవాడ (ప్రశ్న న్యూస్) ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌పై బీఆర్ఎస్ నేతలు చేస్తున్న ఆరోపణలను వేములవాడ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు చంద్రగిరి శ్రీనివాస్ గౌడ్ తీవ్రంగా ఖండించారు. ఆదివారం వేములవాడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, "గత పది సంవత్సరాల్లో జరగని అభివృద్ధి, సంక్షేమ పథకాలను మా నేత ఆది శ్రీనివాస్ అందిస్తున్నారు. అభివృద్ధి పనులు చూసి ఓర్వలేక విపరీత ఆరోపణలు చేస్తున్న బీఆర్ఎస్ నేతలకు ఆయనను విమర్శించే స్థాయి లేదు" అని అన్నారు.ఈ సమావేశంలో డివిజన్ అధ్యక్షుడు సాగరం వెంకటస్వామి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కనికరపు రాకేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ, "కనీసం వార్డు సభ్యులుగా కూడా గెలుపొందని వ్యక్తులు చవకబారు ఆరోపణలు చేస్తుంటే కాంగ్రెస్ పార్టీ ఊరుకోదు" అని హెచ్చరించారు.అభివృద్ధిపై ఎమ్మెల్యే మాట్లాడాలని డిమాండ్ చేస్తున్న బీఆర్ఎస్ నేతలకు "వేములవాడలో జరుగుతున్న అభివృద్ధి కనిపించడం లేదా?" అని ప్రశ్నించారు. మరోసారి ఇలాంటి ఆరోపణలు చేస్తే కఠినంగా సమాధానం ఇస్తామని స్పష్టం చేశారు.

## బ్యాంకులో ఏమన్నా పనులుంటే వెంటనే చేసుకోండి..! సెప్టెంబర్ 15 రోజుల పాటు బ్యాంకులు మూతే..!




సెప్టెంబర్ మాసంలో దాదాపుగా సగం రోజులు బ్యాంకులు మూసే ఉండనున్నాయి. ప్రతినెలా బ్యాంకులకు సెలవులు ఉండే విషయం అందరికీ తెలిసిందే. బ్యాంకుల సెలవులకు సంబంధించిన జాబితాను రిజర్వ్ బ్యాంక్ విడుదల చేసింది.

ఏవైనా ఆర్థిక సంబంధిత పనుల కోసం వెళ్లేవారు ఏయే రోజుల్లో బ్యాంకులు పని చేస్తాయో.. సెలవులుంటాయో తెలుసుకోవడం మంచిది. సాధారణ సెలవులతో పాటు పండుగ సెలవులు కలుపుకొని 15 రోజులు సెలవులు రానున్నాయి. అయితే, బ్యాంకులు మూసి ఉన్నా మొబైల్, ఇంటర్‌నెట్ బ్యాంక్, యూపీఐ సర్వీసులు యథావిధిగా పని చేయనున్నాయి. అయితే, కొన్ని అవసరాల కోసం తప్పనిసరిగా బ్యాంకుకు వెళ్లాల్సిన పరిస్థితి ఉంటుంది. నగదు ఉపసంహరణ కోసం ఏటీఎంలు అందుబాటులో ఉండనున్నాయి. పలు బ్యాంకులు క్యాష్ డిపాజిట్ కోసం మెషిన్స్ సైతం అందుబాటులో ఉంచాయి. ఇందులో అకౌంట్లో డబ్బులు చేసుకునే వీలున్నది. కొన్ని సేవల కోసం బ్యాంకులకు వెళ్లే అవసరం ఉంటుంది. అలాంటి సమాచారం సెలవుల గురించి సమాచారం ఉంటే.. ముందస్తుగానే పనులు చేసుకునే వీలుంటుంది. మరి సెప్టెంబర్‌లో ఏ రోజుల్లో బ్యాంకులకు సెలవులు వచ్చాయో తెలుసుకుందాం రండి..!

## ఉధృతంగా చీనాబ్ నది ప్రవాహం.. తెరుచుకున్న బాగ్లిహార్ డ్యామ్ గేట్లు..

జమ్మూకశ్మీర్ లో గత కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కు చీనాబ్ నది ఉధృతంగా ప్రవహిస్తున్నది. దాంతో రాంబన్ జిల్లా లోని బాగ్లిహార్ డ్యామ్ సామర్థ్యానికి మించి నిండిపోయింది. నీటిమట్టం పెరగడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ముందు జాగ్రత్తగా డ్యామ్ గేట్లన్నీ ఎత్తారు. దాంతో చీనాబ్ నది పరవళ్లు తొక్కుతూ, నురగలు కక్కుతూ దిగువకు పరుగులు పెడుతోంది. అక్కడికి వెళ్లిన పర్యాటకులకు ఆ దృశ్యాలు కనువిందు చేస్తున్నాయి. కింది వీడియోలో ఆ దృశ్యాలు మీరు కూడా చూడండి.

# గణేష్ ఉత్సవాల సందర్భంగా శివనగర్‌లో అన్న ప్రసాద వితరణ




ఖిలా వరంగల్: నగరంలోని శివనగర్ వాసవి లైన్‌లో వినాయక ట్రస్ట్ భవన్ ఆధ్వర్యంలో ఆదివారం గణపతి స్వామికి విశేష పూజలు నిర్వహించారు. నిత్యం భజనలు ,సంకీర్తనలు, సాంస్కృతిక కార్యక్రమాలతో గణనాధునికి మంగళ నిరాజనాలు అర్పిస్తున్నారు. గత శుక్రవారం వినాయక మండపాన్ని రూ. 1.53 కోట్ల కరెన్సీ నోట్లతో ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం కరెన్సీ నోట్లకు ధనలక్ష్మి పూజ చేశారు. ఆదివారం మహా అన్నదాన ప్రసాద వితరణ చేపట్టడంతో స్థానికులు భారీగా తరలివచ్చారు. కరెన్సీ గణనాథుని దర్శించుకుని అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

## శ్రీశైలానికి పెరుగుతున్న వరద.. 8 గేట్లు ఎత్తిన అధికారులు



శ్రీశైలం : ఏపీలోని నంద్యాల జిల్లా శ్రీశైలం ప్రాజెక్టుకు భారీగా వరద నీరు వచ్చి చేరుతుంది. దీంతో అధికారులు ప్రాజెక్టు 8 గేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. ఎగువ ప్రాంతాల నుంచి జలాశయానికి 3.40 లక్షల క్యూసెక్కుల నీరు వస్తుండగా 3.12 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నుంచి 30 వేల క్యూసెక్కులు, ఎడమగట్టు విద్యుత్ కేంద్రం నుంచి 35,315 క్యూసెక్కులు, కుడిగట్టు విద్యుత్ కేంద్రం నుంచి 30,624 క్యూసెక్కులు , 8 గేట్లను 10 అడుగులు ఎత్తి 2,16,520 క్యూసెక్కులు విడుదల చేశారు. శ్రీశైలం జలాశయం పూర్తిస్థాయి నీటి మట్టం 885 అడుగులకు 882.80 అడుగుల వరకు నీటిమట్టం ఉంది. శ్రీశైలం జలాశయం నీటినిల్వ సామర్థ్యం 215.80 టీఎంసీలకు ప్రస్తుతం నీటినిల్వ ఉందని తెలిపారు.

## ఖైరతాబాద్ మహాగణపతి నిమజ్జనంలో మార్పు.. ఒక్కరోజు ముందే..!



ఖైరతాబాద్ మహాగణపతి నిమజ్జనం షెడ్యూల్‌లో మార్పు చోటుచేసుకుంది. చంద్రగ్రహణం నేపథ్యంలో ఒక్కరోజు ముందే గణేశ్ నిమజ్జనం చేయాలని ఖైరతాబాద్ గణేశ్ ఉత్సవ కమిటీ నిర్ణయించింది.ముందుగా నిర్ణయించిన దాని ప్రకారం సెప్టెంబర్ 7వ తేదీన మహాగణపతి నిమజ్జనం జరగాల్సి ఉంది. కానీ అదే రోజు చంద్ర గ్రహణం ఉండటంతో నిమజ్జనం ఎప్పుడు చేయాలనే దానిపై ఇటీవల సందిగ్ధత నెలకొంది. ఈ క్రమంలో గణేశ్ ఉత్సవ కమిటీ ఒక క్లారిటీ ఇచ్చింది. సెప్టెంబర్ 6వ తేదీనే శోభాయాత్ర నిర్వహించి, నిమజ్జనం పూర్తి చేయనున్నట్లు ప్రకటించింది. ఈ మార్పును భక్తులు గమనించాలని సూచించింది. ఇదిలా ఉంటే ఖైరతాబాద్‌లో కొలువుదీరిన శ్రీ విశ్వశాంతి మహాశక్తి గణపతిని దర్శించుకునేందుకు ఆదివారం భక్తులు పోటెత్తారు. సెలవుదినం కావడంతో లక్షలాదిగా తరలివచ్చారు. మింట్ కాంపౌండ్, వార్డు ఆఫీసు, రైల్వే గేటు నుంచి ఏర్పాటు చేసిన క్యూలైన్లు కిక్కిరిసిపోయాయి.. ఖైరతాబాద్ చౌరస్తాలో క్యూలైన్ దాటి జనం క్యూకట్టారు. ట్రాపిక్‌జామ్‌లు కాకుండా ఉండేందుకు ఇప్పటికే పోలీసులు ప్రత్యేక రూట్ మ్యాప్ విడుదల చేశారు.

# టీడీపీలో వర్గపోరు..

## గణేశ్ నిమజ్జనం వేళ తాడిపత్రిలో ఉద్రిక్తత




అనంతపురం జిల్లా తాడిపత్రిలో మరోసారి ఉద్రికత్త పరిస్థితులు నెలకొన్నాయి. టీడీపీ నేతల మధ్య ఆధిపత్య పోరుతో ఘర్షణలు చెలరేగాయి. గణేశ్ శోభాయాత్రలో జేసీ ప్రభాకర్ రెడ్డి, కాకర్ల రంగనాథ్ వర్గీయులు రాళ్లు రువ్వుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. గణేశ్ నిమజ్జనం సందర్భంగా ఆదివారం నాడు తాడిపత్రిలో జేసీ ప్రభాకర్ రెడ్డి, కాకర్ల రంగనాథ్ అనుచరులు వేర్వేరుగా వినాయక శోభాయాత్ర నిర్వహించారు. ఊరేగింపు తీస్తుండగా అశోక్ పిల్లర్ వద్ద ఇరువర్గాలు ఎదురెదురు పడ్డాయి. ఈ క్రమంలో ఇరువర్గాలు పరస్పరం నినాదాలు చేసుకున్నారు. మితిమీరి ఒకరిపైఒకరు రాళ్లు రువ్వుకున్నారు. ఇరువర్గాల ఘర్షణలో పలు వాహనాలు కూడా ధ్వంసమయ్యాయి. దీంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. జేసీ ప్రభాకర్ రెడ్డి, కాకర్ల రంగనాథ్ అనుచరుల మధ్య ఘర్షణల గురించి సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన అక్కడకు చేరుకున్నారు. పెద్ద ఎత్తున మోహరించి ఇరువర్గాలను చెదరగొట్టారు. దీనిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

# శ్రీనగర్ కాలనీ సమస్యలను పరిష్కరించడంలో ముందుంటా: దండు సంతోష్



ఉప్పల్ (ప్రశ్న న్యూస్) రామంతపూర్ శ్రీనగర్ కాలనీలో సమస్యలను పరిష్కరించడంలో ముందుంటానని శ్రీనగర్ కాలనీ అసోసియేషన్ అధ్యక్షులు దండు సంతోష్ అన్నారు. శ్రీనగర్ కాలనీ స్ట్రీట్ నెంబర్ మూడు లో గత ఆరున్నర సంవత్సరాల నుండి కరెంటు పోల్ సమస్యను ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి కి వివరించగా అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించమని అధికారులకు తెలిపారు. దండు సంతోష్ అధికారులతో కరెంటు పోల్ విషయమై చర్చించి సమస్యను త్వరగా పరిష్కరించాలని అధికారులతో దగ్గరుండి సమస్యను అధికారులు వివరించి సమస్యను పరిష్కరించామని తెలిపారు.సమస్యను పరిష్కరించినందుకు ఈ సందర్భంగా అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీనగర్ కాలనీ వైస్ ప్రెసిడెంట్ బాలరాజు, శ్రీకాంత్, జాయింట్ సెక్రెటరీ వంశీ, వేణు, శివ గౌడ్, మరియు కాలనీ సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# హెచ్‌ఎంఎస్ గౌరవ అధ్యక్షురాలుగా కల్వకుంట్ల కవిత

**శ్రీరాంపూర్ లో జరిగిన హెచ్‌ఎంఎస్ జనరల్ బాడీ సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నిక**

**నాయిని నర్సింహారెడ్డి తర్వాత హెచ్‌ఎంఎస్ గౌరవ అధ్యక్ష పదవి ఎన్నికైన రెండో బీఆర్ఎస్ నేత కవిత**

శ్రీరాంపూర్( ప్రశ్న న్యూస్) సింగరేణిలోని హెచ్ఎంఎస్ (ది సింగరేణి మైనర్స్ అండ్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్) గౌరవ అధ్యక్షురాలిగా బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.ఆదివారం మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ లో నిర్వహించిన హెచ్ఎంఎస్ జనరల్ బాడీ సమావేశంలో సంఘం ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్ కవిత ను గౌరవ అధ్యక్షురాలుగా ఎన్నుకుంటున్నట్టు ప్రతిపాదించగా సభ్యులందరూ ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ సందర్భంగా ఈ సమావేశంలో ప్రధాన తీర్మానాలు పాత విఆర్ఎస్ స్కీమ్ ని పునరుద్ధరించడం, వేలంపాట లేకుండా తెలంగాణ బొగ్గు బ్లాక్లను సింగరేణి కేటాయించడం, సింగరేణి కార్మికులకు పెర్క్స్ రియంబర్స్మెంట్ క్రింద ఐటీ రిటర్న్స్ ఇప్పించడం, సింగరేణిలో అలియాస్ నేమకనిపించడమారుపేరుల సమస్యతో) బాధపడుతున్న కార్మికులను వన్ టైం సెటిల్మెంట్ కింద క్రమబద్ధీకరించడం, అనారోగ్య సమస్యలతో అండర్ గ్రౌండ్ అన్ఫిట్ అయి సర్ఫేస్ ఫిట్ తీసుకున్న సింగరేణి కార్మికునికి బేసిక్ ప్రొటెక్షన్ మరియు సూటబుల్ జాబ్ ఇప్పించడం, కార్మికులకి సొంత ఇంటి పథకం అమలు చేయడం, సింగరేణిలో పెండింగ్ విజిలెన్స్ కేసులను క్రమబద్ధీకరించడం,జైపూర్ పవర్ ప్లాంట్ లో పనిచేస్తున్న భూనిర్వాసితులకు రెగ్యులరైజ్ చేయడం, సింగరేణి కార్మికులకు కంపెనీ లాభాల వాటా 35% ఇప్పించడం, సింగరేణిలో పని చేస్తున్న కాంట్రాక్ట్ వర్కర్స్ కి కంపెనీ లాభాల్లో 10% వాటా ఇప్పించడం,సింగరేణిలో పనిచేస్తున్న మహిళలకి వాళ్ళ విద్యార్హతకి తగిన ఉద్యోగాలు కనిపించడం ఈ సమావేశంలో తీర్మానాలు చేశారు.



# ఫీల్ గుడ్ హెూమ్స్ కమ్యూనిటీ హాల్ లో గణేష్ నవరాత్రి పూజలు

**హాజరైన స్త్రీ శక్తి మహిళలు**




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) రాజేంద్ర నగర్ గంధం గూడ ఫీల్ గుడ్ హెూమ్స్ కమ్యూనిటీ హాల్ లో అంగరంగవైభవంగా గణేష్ నవరాత్రి ఉత్సవాలను నిర్వహిస్తున్నారు.ఈ సందర్భంగా యువత



కు ఆటల పోటీలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఫీల్ గుడ్ హెూమ్ అసోసియేషన్ అధ్యక్షులు తోటకూర శ్రీనివాసరావు మాట్లాడుతూ శ్రీ విశ్వావసు నామ సంవత్సరం భాద్రపద మాసం లో ప్రతి కుటుంబానికి అష్టైశ్వర్యాలు కలగాలని ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని విఘ్నాలను తొలగించే ఆ గణనాథుని పూజించడం వల్ల విజయాలు పొందుతామని, కాలనీలో నివసిస్తున్న ప్రజలందరూ గణేష్ పూజా కార్యక్రమాల్లోను, అన్నదానం కార్యక్రమాల్లోను ఎంతో ఉత్సాహంగా పాల్గొంటున్నారని ఆ గణనాథుని ఆశీస్సులు అందరికీ ఉండాలని ఈ సందర్భంగా అన్నారు.ఈ కార్యక్రమంలో ఫీల్ గుడ్ హెూమ్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రాజు, సంయుక్త కార్యదర్శి దిలీప్, మరియు సుదర్శన్ రావు, లక్ష్మయ్య శ్రీనివాస్, మరియు సినీ ఆర్టిస్ట్ పొట్టేలు శ్రీనివాసరావు, సినీ రచయిత తిరునగరి స్వామి, స్త్రీ శక్తి మహిళలు, యువత ఆనందోత్సాహాలతో కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# అన్ని రంగాల్లో తెలంగాణ రాష్ట్ర భట్రాజు సంఘం ముందంజ: విష్ణువర్ధన్ రాజు

**రాజకీయంగా ఆర్థికంగా ముందుండాలి**

**సంఘం అభివృద్ధికై పాటుపడాలి**

**నేటి యువత రేపటి యువతరానికి ఆదర్శం కావాలి**

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అయిన తర్వాత రాష్ట్ర భట్రాజు సంఘం అన్ని కార్యక్రమాలలో ముందంజలో ఉందని తెలంగాణ భట్రాజు సంఘం రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు దేవరాజు విష్ణువర్ధన్ రాజు, ప్రతికంఠం పూర్ణచందర్ రాజు తెలిపారు.కులం సంఘంలో వివిధ అనుబంధ సంఘాలను ఏర్పాటు చేశామని విద్యా ఉపాధి కమిటీని వేసి మేధావులైన కుల బంధువులతో ఇంజనీరింగ్ విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు ప్రతి శనివారం గూగుల్ మీట్ ద్వారా నలభై మూడు వారాలుగా నిర్విరామంగా తరగతులు నిర్వహిస్తున్నామని, విద్యార్థులకు వివిధ రకాల శిక్షణలు తరగతులు నిర్వహిస్తున్నామని, బీద ఇంజనీరింగ్ విద్యార్థులకు ల్యాబ్ టాప్ లను పంపిణీ చేసామన్నారు. సాహిత్య కమిటీ వేసి కవులందరిని వెలికితీసి కవి సమ్మేళనం గ్రూపు ఏర్పాటు చేసి ప్రతి ఆదివారం డెబ్బది రెండు వారాలు గా గూగుల్ మీట్ ద్వార కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, చిన్నారులకు శ్లోకాలు పద్యాలు, నృత్య పోటీలు, ఏర్పాటు చేశామని, సంఘీయులైన డాక్టర్ లందరిని ఏకంచేసి వారితో ఆరోగ్యపరమైన సలహాలు సూచనలు తెలుపుతున్నారని, పెద్దల కమిటీ ఏర్పాటు చేసి సంఘీయులలో వున్న తగాదాలు పరిష్కారం చేస్తున్నామని,సాంస్కృతిక కమిటీ ద్వారా సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామని, క్రీడలు, న్యాయ సలహాలు తదితర అంశాలపై శ్రద్ధ చూపుతున్నామని, మూడు మాసాలకు ఒకసారి రాష్ట్ర కార్యవర్గ సమావేశం లో చర్చిస్తున్నామని, ఐకమత్యంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అన్నారు.ప్రతి సంవత్సరం ఉగాది పురస్కారుల భాగంగా కవి సమ్మేళనాలు, పురస్కారాలు విద్యార్థులకు ప్రోత్సాహకాలు, బీద విద్యార్థులకు ఆర్థిక సహకారం భట్రాజు సంఘ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామని, కరోనా సమయం లో ఇబ్బంది లో వున్నా కుటుంబాలకు ఆర్థిక సహకారం అందించామని తెలిపారు.ప్రస్తుతం కామారెడ్డి వరద బాధిత భట్రాజు కుటుంబాలకు ఆర్థిక సహకారం అందించటానికి ప్రయత్నాలు చేస్తున్నామని తెలిపారు. డిసెంబరు జనవరి మాసంలో రాష్ట్ర మహాసభ ఏర్పాటు చేయటానికి సన్నాహాలు చేస్తున్నామని, ఇంజాపూర్ లో సంఘ కార్యక్రమాలు నిర్వహించు కోవటానికి సంఘం సభ్యుల చే విరాళాల ద్వార సంఘ భవనం నిర్మించుకుందామని సంఘ కార్యక్రమాలకు సహకరిస్తున్న కుల





బంధువులకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేశారు. రాజకీయంగా ఆర్థికంగా ఎదగాలని ప్రతి ఒక్కరూ సంఘ సేవ లో పాల్గొనాలని మనం సంపాదించిన దాంట్లో 10 శాతాన్ని సేవా కార్యక్రమాలకు వినియోగించాలని ఆపదలో ఉన్న కుల బంధువులను ఆదుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉన్నదని ఈ సందర్భంగా తెలిపారు.

# మణికంఠ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గణపతి హెూమం



అంబర్ పేట (ప్రశ్న న్యూస్) అంబర్ పేట పటేల్ నగర్ శ్రీ మహాలక్ష్మి కాలనీ లో మణికంఠ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గణనాథుని మండపం వద్ద గణపతి హెూమం కార్యక్రమాన్ని



నిర్వహించారు.ఈ సందర్భంగా మణికంఠ యూత్ అసోసియేషన్ నాయకులు ప్రణయ్ రాము మాట్లాడుతూ గణనాథుని ఆశీస్సులతో ప్రతి సంవత్సరం గణనాథునికి ఘనమైన పూజలు నిర్వహిస్తున్నామని, పెద్ద చిన్న తారతమ్యం లేకుండా ప్రతి ఒక్కరం గణపతి నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని గణనాథుని ఆశీస్సులతో అందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ఈ సందర్భంగా ఆ దేవదేవుని ప్రార్థించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జర్నలిస్టు సంక్షేమ సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఓంకారం సంతోష్ రాజ్, బిఆర్ఎస్ పార్టీ అంబర్ పేట డివిజన్ మాజీ అధ్యక్షులు ఉంగరాల మల్లేష్ యాదవ్,

# గణనాథుని ఆశీస్సులతో తెలంగాణ ప్రజలు సుభిక్షంగా ఉండాలి: కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి



అంబర్ పేట (ప్రశ్న న్యూస్) అంబర్ పేట డివిజన్ పటేల్ నగర్ దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో నవరాత్రి ఉత్సవంలో భాగంగా నిర్వహించిన గణనాథుని పూజా కార్యక్రమంలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గణనాథుని ఆశీస్సులతో తెలంగాణ ప్రజలు సుభిక్షంగా ఉండాలని రాబోయే గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికల్లో మేయర్ స్థానాన్ని బిజెపి పార్టీ కైవసం చేసుకోవాలని బిజెపి పార్టీ జెండా ఎగర వెయ్యాలని, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వాన్ని బలపరచాలని, ప్రపంచంలోనే భారతదేశం నెంబర్ వన్ స్థానంలో ఉండాలని, ప్రజలను ఎల్లవేళలా ఆ గణనాథుడు కాపాడాలని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు.ఈ కార్యక్రమంలో అంబర్ పేట డివిజన్ బిఆర్ఎస్ పార్టీ కార్పొరేటర్ విజయ్ కుమార్ గౌడ్, బిజెపి పార్టీ సీనియర్ నాయకులు గౌతమ్ రావు, బిక్షపతి, నాగభూషణం చారి,యశ్వంత్, నరేష్ గౌడ్, రామ్ చందర్ గుప్తా, పెంటమ్ రాజు, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# మహిళల స్ఫూర్తిదాయక భాగస్వామ్యంతో భక్తులకు అన్నదాన సేవలు

**- శ్రీ వేణుగోపాల స్వామి యూత్ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం వితరణ**



వేములవాడ (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా,వేములవాడ మున్సిపల్ పరిధిలోని 21వ వార్డులో “శ్రీ వేణుగోపాల స్వామి యూత్” ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద గణేష్ నవరాత్రోత్సవాలలో భాగంగా ఆదివారం భక్తి శ్రద్ధలతో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు అధికసంఖ్యలో హాజరై వినాయకుడికి నైవేద్యం సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సుమారు 500 మందికి పైగా భక్తులకు ప్రసాదం,అన్నదానం అందించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ %–%”తొలిసారిగా ఈఏడాది వినాయక నవరాత్రోత్సవాలు భక్తి భావంతో నిర్వహిస్తున్నాం. దేవుడి కృపతో అన్నదానం వంటి సేవా కార్యక్రమాలు విజయవంతంగా సాగుతున్నాయి. భక్తుల



సహకారంతో భవిష్యత్తులో మరిన్ని సాంస్కృతిక, సేవా కార్యక్రమాలు చేపడతాం. ఈ కార్యక్రమంలో సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు” అని పేర్కొన్నారు.

# విశ్వంలో విశ్వకర్మ లేనిదే విశ్వం లేదు: చెల్లోజు రాజు

**- చిగురుమామిడిలో విశ్వకర్మ యజ్ఞ మహెూత్సవం విజయవంతం చేయాలని పిలుపు - కరపత్రం ఆవిష్కరణ**

**- విశ్వకర్మల సంక్షేమం కోసం ప్రత్యేక కార్పోరేషన్ ఏర్పాటు చేయాలి**

**- విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ ఐక్య సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు చెల్లోజు రాజు**



చిగురుమామిడి (ప్రశ్న న్యూస్) ఈనెల 17న జరగనున్న విశ్వకర్మ యజ్ఞ మహెూత్సవాన్ని ఘనంగా నిర్వహిద్దాం అని విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం చిగురుమామిడి మండల కేంద్రంలో విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు గొల్లపల్లి సదాచారి ఆధ్వర్యంలో కరపత్రాన్ని



ఆవిష్కరించారు.ఈ కార్యక్రమానికి విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ ఐక్య సంఘం తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు చెల్లోజు రాజు, అఖిల భారత విశ్వకర్మ పరిషత్ రాష్ట్ర సహాయ కార్యదర్శి కొత్తపల్లి సత్యనారాయణ,మండల అధ్యక్షులు శ్రీరామోజు రాజ్‌కుమార్, కరీంనగర్ అర్బన్ అధ్యక్షులు గర్రెపల్లి శ్రీనివాస్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

**విశ్వకర్మ మయం జగత్ - విశ్వంలో విశ్వకర్మ లేనిదే విశ్వం లేదురా..**

చెల్లోజు రాజు మాట్లాడుతూ ఈ విశ్వ సృష్టి విశ్వకర్మల కృషితో నడుస్తోంది. మన వృత్తులు మన గౌరవం. విశ్వకర్మల ఐక్యతే మన బలం. సెప్టెంబర్ 17న జరగనున్న యజ్ఞ మహెూత్సవం ద్వారా మన శక్తి, ఐక్యతను చాటుదాం” అని పిలుపునిచ్చారు.

**ప్రభుత్వం అధికారికంగా జరపాలి..**

తెలంగాణ రాష్ట్రంలో 9 శాతం విశ్వబ్రాహ్మణ జనాభా ఉన్నప్పటికీ ఇప్పటి వరకు వారికి న్యాయం జరగలేదు. ప్రత్యేక విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ ఏర్పాటు చేసి రూ. 2,000 కోట్లు నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ను త్వరలోనే కలిసి, సమస్యలను నివేదిస్తామని తెలిపారు.

**విశ్వకర్మలందరూ ఐక్యం కావాలి..**

చిగురుమామిడి మండల అధ్యక్షులు శ్రీరామోజు రాజ్‌కుమార్, గ్రామ శాఖ అధ్యక్షులు గొల్లపల్లి సదాచారి మాట్లాడుతూ – “చిగురుమామిడిలో జరిగే యజ్ఞ మహెూత్సవాన్ని చారిత్రాత్మకంగా నిలబెట్టుదాం” అని పిలుపునిచ్చారు.

# ప్రజల అభిమానంలో తడిసి ముద్దయ్యనా "ముద్దం"

- ఓల్డ్ బోయిన్ పల్లిలో మండపాల వద్ద కళకారుల నృత్యాలు,నేతల కిరాక్ డాన్సులు అందరినీ అలరించాయి
- తెలంగాణ జానపద పాటలతో తీన్మార్ స్టెప్పులతో అదర గొట్టిన కార్పొరేటర్
- బోయిన్ పల్లి డివిజన్ లో ప్రజల మనస్సు గెలిచిన నేతనర్సింహా యాదవ్
- వినాయకునికి హారతి, విఘ్నాలను తొలగించాలని మొక్కులు
- బలమైన కోరిక వినాయకుడు ముందు తీర్చాలని కోరినా నేత





కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్) కూకట్పల్లి నియోజకవర్గంలో అతి కీలకమైన డివిజన్ బోయిన్ పల్లి డివిజన్.గతమూడు పర్యాయాలుగా గెలుపు జెండాను ఎగురవేస్తున్న నాయకుడు ముద్దం నర్సింహా యాదవ్.ఓటమి చవి చూడకుండా డివిజన్ పరిధిలో ఉన్న ప్రజలు మనస్సు గెలుచుకుంటు దినదినాభివృద్ధి చెందుతున్న నేత.బోయిన్ పల్లి ప్రాంతంలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకుంటారు.గత దశాబ్ది కాలం పాటు ప్రజల అభిమానం చెక్కు చెదర కుండా వారి మనస్సులో నిలిచిపోయే ఇంటి పెద్దన్న గా మిగిలిపోయారు.ఓల్డ్ బోయిన్ పల్లి డివిజన్ పరిధిలో వినాయక నవరాత్రులు సందర్భంగా స్థానిక కార్పొరేటర్ ముద్దం నర్సింహా యాదవ్ యూత్ ఏర్పాటు చేసిన వినాయక మండపాల వద్ద పూజలు ఘనంగా నిర్వహించారు.శివపార్వతులపుత్రుడు వినాయక మహారాజ్ కి హారతి ఇచ్చి అష్టోత్తర సంకల్పం చేశారు.భక్తులు ఆయన భక్తి పారవశ్యం చూసి గణపతి పప్పా మోరియా అంటూ భజనలతో మారు మ్రోగించారు.మరో చోట కళాకారులు ఏర్పాటు చేసిన నృత్యాలు చూసి తన్మయంతో ఆనందంతో ఆయనకూడా నాలుగు స్టెప్పులతో పబ్లిలిక్నీఆకర్షించారు.తెలంగాణ జానపద పాటలతో తీన్మార్ స్టెప్పులతో శివమెత్తిన నర్సింహా యాదవ్.అలాగే ఆయన మాట్లాడుతూ ఈసారి మేఘ విస్ఫోటం జరగడం వల్ల రాష్ట్రంలో పలు జిల్లాల్లో రికార్డు స్థాయిలో భారీ వర్షాలు నమోదు కావడం వల్ల ప్రజల జీవన విధానం అతలాకుతలం అవుతుందని,అది గాక కామారెడ్డి జిల్లాలో గణనాథుని కొలవకుండా ప్రకృతి కాటేసింది.గంగమ్మను శాంతించమని విఘ్నేశ్వరుడుని కోరుకుంటున్నాను అంటున్నారు స్థానిక కార్పొరేటర్ ముద్దం నర్సింహా యాదవ్.ఈ నేపథ్యంలో బోయిన్ పల్లి డివిజన్ లో పలు వినాయక మండపాలు తిరుగుతూ గణనాథునికి ప్రత్యేక పూజలు చేస్తూ, తీర్థప్రసాదాల కార్యక్రమంలో పాల్గొని భక్తులకు సేవలు అందించారు.ఈ సంవత్సరం పదకొండో రోజు గ్రహనం ఉన్నందున డివిజన్ లో పలు వినాయక మండపాల నిర్వాహకులు ఐదోరోజు, ఆదివారం కలిసి రావడంతో రకరకాల రూపాల్లో దర్శనమిస్తున్న గణపయ్యకు పలు రకాల పూలతో అలంకరించి నిమజ్జనానికి సిద్ధం చెసిన సిత్రాలే ప్రతి చోటా కన్పించిన దృశ్యాలు.స్థానిక కార్పొరేటర్ ముద్దం నర్సింహా యాదవ్ ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా బోయిన్ చెరువు ప్రాంతాల్లోని జాగ్రత్తలతో పాటు అల్వాల్ పోలీసులు సహాయ సహకారాలతో బందోబస్తు ఏర్పాటు చేశారు.పోలీసులు కూడా భారీ బందోబస్తు మధ్యలో ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలకు తావు లేకుండా నిఘా నేత్రాలతో పరివేక్షిస్తున్నారు.

# ఉద్యోగ విరమణ పొందిన ఆలయ సిబ్బందికి ఘన సన్మానం



వేములవాడ (ప్రశ్న న్యూస్) వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో ఉద్యోగ విరమణ పొందిన డిప్యూటీ ఈఈ తాంద్ర రాజేశ్వరరావు, గుమ్మి పవన్‌లకు ఆదివారం ఆలయ చైర్మన్ గెస్ట్‌హౌస్‌లో ఘన సన్మానం నిర్వహించారు. ఆలయ ఉద్యోగుల యూనియన్ ఆధ్వర్యంలో, కార్యనిర్వహణాధికారి రమాదేవి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఉద్యోగ విరమణ పొందిన వారి సేవలను కొనియాడారు. అనంతరం శాలువాలు కప్పి సత్కరించగా, అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వచనాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

## మేగణపతి మండపాల హిందూ సమ్మేళనం



మేడ్చల్( ప్రశ్న న్యూస్ )మేడ్చల్ నగర గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో తేదీ 3 -9-25 బుధవారం సాయంత్రం 6 గంటలకు మేడ్చల్ నగరంలో గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో గణేష్ మండపాల నిర్వాహకులకు సన్మానం, హిందూ సమ్మేళనం నిర్వహించడం జరుగుతుంది. ఈ సందర్భంగా మేడ్చల్ నగరంలోని గణేష్ మండపాల ను సందర్శించి ఆహ్వానించడం జరిగింది. పాతూరి సుధాకర్ రెడ్డి మేడ్చల్ నగర గణేష్ ఉత్సవ సమితి కార్యనిర్వాహక అధ్యక్షులు, చెరుకొమ్ము శ్రీనివాస్ గౌడ్ ప్రధాన కార్యదర్శి, పడాల రఘురాం పటేల్ సంఘటన కార్యదర్శి, నర్సింగ్ రజక, కొమ్ము పురుషోత్తం సమితి కార్యవర్గ సభ్యులు పాల్గొనడం జరిగింది.

# రేపటి గెలుపే లక్ష్యంగా గల్లీ గల్లీ చుట్టేస్తున్న ఏనుగుల

- భాజపా నేతకి వాడ వాడలా మండపాల నిర్వాహకులు సన్మానం
- ఏనుగుల తిరుపతికి కొండంత సన్మానం,కాషాయ నేత ఓల్డ్ బోయిన్ పల్లి డివిజన్ లో ఉన్న వినాయక మండపాల్లో పూజలు
- డివిజన్లో యూత్ తో అయస్కాంతలా అతుక్కుని పోతున్న బిజెపి నేత
- ఈసారి గెలిచి కాషాయం జెండా కింద పేదల కన్నీళ్లు తుడిచే ఇంటి పెద్దనౌతా





కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్) సాధారణంగా రాజకీయ నాయకులు కుర్చీ కోసమో,పదవి వ్యామోహమో కానీ నేతలు ప్రజల మధ్యలో పోట పోటిగా ప్రజా క్షేత్రంలో ఉంటారు.కొంతమంది డబ్బు, పలుకుబడి రాజకీయ భీష్మల ఆశీస్సులతో అందని ద్రాక్ష కోసం పాటుపడుతుంటారు.ప్రస్తుతం సమాజంలో ప్రజలు నాయకుల పనితీరును గమనిస్తూ ఎవ్వరైతే వారికి సేవలు అందిస్తారో వారినే ఎన్నికల్లో ఎన్నుకుంటారు.ఇదిలేటెస్ట్ ట్రెండ్.ఉదహరణకు మొన్నటి సార్వత్రిక ఎన్నికల్లో కామారెడ్డి ఎన్నికల్లో "త్రిముఖ పోటీ జరిగిన విషయం తెలిసిందే! ఇద్దరు మేధావుల మధ్య ఓ సాదారణ వ్యక్తికి సొంతం అయినది అందరికి తెలిసిందే.ఈ నేపథ్యంలో ఓల్డ్ బోయిన్ పల్లి డివిజన్ ప్రజల మనస్సును గెలువాలనే ఆలోచనతో ప్రతి రోజూ గల్లీ గల్లీ చుట్టేస్తున్న ఏనుగుల తిరుపతి.వినాయక నవరాత్రుల సందర్భంగా నిన్న ఐదో రోజున బోయిన్ పల్లి డివిజన్ ప్రాంతంలో పలు విఘ్నేశ్వరుడు మండపాల వద్ద నిర్వాహకులు ఆహ్వానం మేరకు వినాయక విగ్రహానికి పూలమాల వేసి ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు.తరువాత భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేసిన భాజపా నేత ఏనుగుల తిరుపతి.అలాగేఎల్ బి నగర్,భవాని నగర్,స్వర్ణదామానగర్,జయశంకర్ నగర్,అంజయ్య నగర్,లహరి గ్రిన్స్ అపార్ట్మెంట్, హస్మత్ పేట,హరిజన బస్తీ,రాజ రాజేశ్వరి నగర్ సిండికేట్ బ్యాంక్ కాలనీలలో జరిగిన వినాయక పూజ,అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ నాయకులు హరిజిత్ సింగ్,సాయి రమేష్, కాలనీల అధ్యక్షులు, మండపాల నిర్వాహకులు సన్మానం చేశారు.

## రక్తదాన శిబిరానికి విశేష స్పందన



మేడ్చల్ (ప్రశ్న న్యూస్) వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా లక్కీ ఫ్రెండ్స్ యూత్ హౌసింగ్ బోర్డ్ కాలనీ వారు నిర్వహించిన 24వ సంవత్సర వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన మెగా రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది.. ఈ శిబిరాన్ని ఉదయం 10 నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు నిర్వహించారు. ఇందులో 100 కి పైగా దాతలు పాల్గొని రక్తాన్ని దానం చేశారని నిర్వాహకులు తెలిపారు. రక్త దానం చేసిన ప్రతి ఒక్కదాతకు కమిటీ సభ్యులు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యక్రమంలో లక్కీ ఫ్రెండ్స్ అధ్యక్షులు రామస్వామి తో పాటు యువజన సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దగ్ధం



మేడ్చల్ (ప్రశ్న న్యూస్) ప్రధాని నరేంద్ర మోడీ, ఆయన తల్లి గురించి కాంగ్రెస్ కార్యకర్తలు అసభ్య నినాదాలు చేయడాన్ని నిరసిస్తూ గుండ్లపోచంపల్లి మున్సిపల్ అధ్యక్షులు కావేరి శ్రీధర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ ను దగ్ధం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు పట్లోల విక్రమ్ రెడ్డి పాల్గొని మాట్లాడుతూ ఇటీవల బీహార్‌లో రాహుల్ గాంధీ నిర్వహించిన కాంగ్రెస్ సమావేశంలో ప్రధాని నరేంద్ర మోదీ ఆయన తల్లి గురించి అసభ్యకర నినాదాలు వినిపించబడ్డాయని ఆరోపించారు. ఇది వ్యక్తిగత అవమానం మాత్రమే కాకుండా, భారతీయ సంస్కృతిలో తల్లిని గౌరవించే విలువలకు అవమానమని అయన పేర్కొన్నారు.ఈ ఘటన కాంగ్రెస్ పార్టీ దిగజారుడు రాజకీయాలకు నిదర్శన మన్నారు ఈ కార్యక్రమంలో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ అమరం మోహన్ రెడ్డి, అమరం సరస్వతి, మాజీ ఎంపీటీసీ సభ్యులు ఉషిగారి శ్రీనివాస్ ముదిరాజ్, మున్సిపల్ ప్రధానకార్యదర్శి చింతలపూడి రామారావు, ఉపాధ్యక్షులు వసంత్ రెడ్డి, మలిగే శ్రీకాంత్, మహిళా మోర్చా అధ్యక్షురాలు బట్టికడి నవనీత, యువమోర్చ అధ్యక్షులు విక్రమ్, సుంకు నవీన్, అరుణ్, వినోద్, శాంతాన్ రెడ్డి గణేష్, ప్రదీప్, అనుదీప్, వినయ్, తదితరులు పాల్గొన్నారు.

## గణనాధుని పూజలో మేడ్చల్ మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ దంపతులు



మేడ్చల్ (ప్రశ్న న్యూస్) మేడ్చల్ పట్టణంలో భగత్ సింగ్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో మేడ్చల్ మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ దీపిక నర్సింహారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి సంవత్సరం మాదిరిగా ఈ సంవత్సరం సైతం భగత్ సింగ్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వినాయక మండపంలో మేడ్చల్ మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ దంపతులు మర్రి దీపిక నరసింహారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలను నిర్వహించారు. పట్టణ ప్రజలు ఆనందంగా ఉండాలని ఆ గణనాథుని కోరుకున్నట్లు మేడ్చల్ మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ మర్రి దీపిక నరసింహారెడ్డి తెలిపారు. ప్రతి సంవత్సరం మాదిరిగా ఈ సంవత్సరం సైతం గణనాథుని విగ్రహాన్ని మేడ్చల్ మాజీ ఉపసర్పంచ్ అయిన మర్రి నరసింహారెడ్డి కొనివ్వడం జరిగింది.

## ఆధ్యాత్మిక సామాజిక కార్యక్రమాలు ఐక్యతను పెంపొందిస్తాయి

- గంగాధర సబ్ ఇన్స్పెక్టర్ : వంశీకృష్ణ
- నాగిరెడ్డిపూర్‌లో విఘ్నేశ్వర నవరాత్రి ఉత్సవాల్లో అన్నదానం



గంగాధర (ప్రశ్న న్యూస్) గంగాధర మండలంలోని నాగిరెడ్డిపూర్ గ్రామంలో వినాయక యూత్ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా జరుగుతున్న విఘ్నేశ్వర నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం అన్నదాన సేవా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గంగాధర ఎస్సై వంశీకృష్ణ, బీజేపీ మండల అధ్యక్షులు పంజాల ప్రశాంత్ ముఖ్య అతిథులు గా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎస్సై వంశీకృష్ణ మాట్లాడుతూ, "ఇలాంటి ఆధ్యాత్మిక,సామాజిక కార్యక్రమాలు గ్రామాలలో ఐక్యతను పెంచుతాయి. వినాయక చవితి ఉత్సవాలను పర్యావరణహితంగా నిర్వహించడం చాలా అవసరం" అని అన్నారు. అనంతరం బీజేపీ మండల అధ్యక్షులు పంజాల ప్రశాంత్ మాట్లాడుతూ "వినాయక యూత్ శ్రద్ధ, కృషి ప్రశంసనీయమైందని,గ్రామ యువత ఇలా ముందుండి సేవా కార్యక్రమాలు నిర్వహించడం సమాజాన్ని మంచి దిశలో నడిపిస్తుంది" అని పేర్కొన్నారు.ఈ నేపథ్యంలో ఎస్సై వంశీకృష్ణ ను శాలువాతో ఘనంగా సన్మానించి, ప్రసాదాలను అందించారు.ఈ కార్యక్రమంలో పంజాల రమేష్, సిరికొండ మధు, మారుతి,మహిపాల్, వినాయక యూత్ సభ్యులు, అధికసంఖ్యలో భక్తులు, గ్రామస్తులు,తదితరులు పాల్గొన్నారు.

# చిత్ర పరిశ్రమలో విషాదం..
## నటి ప్రియా మరాఠే కన్నుమూత..!

భారతీయ చిత్ర పరిశ్రమలో విషాదకర ఘటన చోటు చేసుకున్నది. ప్రముఖ టెలివిజన్ షో 'పవిత్ర రిస్తా' ఫేమ్ నటి ప్రియా మరాఠే (38) తుదిశ్వాస విడిచారు. ముంబయిలని మీరా రోడ్‌లోని తన ఇంట్లో ఆమె కన్నుమూశారు. నటి మరణ వార్త అందరినీ దిగ్భ్రాంతికి గురిచేసింది. సోషల్ మీడియా వేదికగా ఆమె మృతిపై పలువురు విచారం వ్యక్తం చేశారు. 'ఇది చాలా షాకింగ్ వార్త. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలి' అంటూ ఓ యూజర్ రాశారు. 'పవిత్ర రిస్తా' సీరియల్‌లో ఆమె వర్ష పాత్రను పోషించారు. ప్రియా మాత్రమే పలు మరాఠీ సీరియల్స్‌తో పాటు చిత్రాల్లోనూ నటించారు.పలు హిందీ టెలివిజన్ షోల్లో కూడా పాల్గొంది. ఇందులో 'పవిత్ర రిస్తా'లో వర్ష పాత్రతో అభిమానులకు దగ్గరైంది. ఈ సీరియల్‌లో నటి అంకితా లోఖండే సోదరి పాత్రను పోషించింది. ఈ సీరియల్‌లో సుశాంత్ రాజ్‌పుత్ సింగ్ కూడా నటించిన విషయం తెలిసిందే. అలాగే, 'చార్ దివాస్ ససుచే, కసమ్ సే, కామెడీ సర్కస్ కే సూపర్ స్టార్స్, ఉత్తరన్, బడే అచ్చే లగ్తే హై, భారత్ కా వీర్ పుత్ర మహారాణా ప్రతాప్, సావధాన్ ఇండియా, భాగే రే మన్ వంటి షోలలో నటించింది. 2012 ఇండస్ట్రీలోకి వచ్చిన ప్రియా.. ఇప్పటి వరకు 20పైగా షోలతో పాటు రెండు చిత్రాల్లో నటించారు. మె చేసిన పాత్రలన్నీ చాలా సహజంగా ఉంటాయి. ఆమె తన నటనతో ఎంతో మంది అభిమానులను ఆకట్టుకున్నారు. ప్రియా మరాఠే 1987 ఏప్రిల్ 23న ముంబయిలో పుట్టింది. అక్కడే తన విద్యాభ్యాసం పూర్తి చేసుకుంది. మరాఠీ టీవీ షో 'యా సుఖనోయ' ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చింది. బాలీవుడ్‌లో 'పవిత్ర రిస్తా' సీరియల్‌తో మంచి గుర్తింపు తెచ్చుకుంది. ప్రియా చివరిసారిగా మరాఠీ సీరియల్ 'తుజెచ్ మి గీత్ గాత్ ఆహే'లో నటించింది. ప్రియా 2012లో నటుడు శంతను మోఘేను వివాహం చేసుకుంది. సోషల్ మీడియాలో ఆమెకు భారీగా ఫాలో అవర్స్ ఉన్నారు. అయితే, ఆగస్టు 11, 2024న పోస్ట్ చేసింది. నటి తన భర్తతో జైపూర్ పర్యటనకు సంబంధించిన ఫోటోలను



అభిమానులతో షేర్ చేసింది. అయితే, గత కొంతకాలంగా ఆమె కాన్సర్‌తో పోరాడుతున్నారు. ఈ క్రమంలోనే పరిస్థితి విషమించి తుదిశ్వాస విడిచారు. ఆమె మరణ వార్త విని అభిమానులతో పాటు తోటి నటీనటులు సంతాపం వ్యక్తం చేస్తున్నారు. ఆమె మృతికి ప్రగాడ సానుభూతి తెలిపారు.

# మరో హారర్ జానర్ చిత్రంలో నేషనల్ క్రష్..



నేషనల్ క్రష్ రష్మిక మందన్నా దక్షిణాదితోపాటు బాలీవుడ్‌లోనూ బిజీగా ఉంది. ఇటీవలే 'కుబేర' చిత్రంతో ప్రేక్షకుల్ని పలకరించింది బెంగళూరు బ్యూటీ. ఈ దీపావళికి 'థామా'తో అలరించడానికి సిద్ధమవుతోంది. ఆయుష్మాన్ ఖురానాతో ఆమె నటించిన హారర్ లవ్‌స్టోరీ ఇది. అక్టోబరు 21న ప్రేక్షకుల ముందుకురానుంది. తాజా సమచారం ప్రకారం రష్మిక హిట్ హారర్ ఫ్రాంఛైజీల చిత్ర విషయంలోనూ రష్మిక పేరు వినిపిస్తోంది.'కాంచన' సిరీస్ సినిమాలతో ప్రేక్షకుల్ని మెప్పించిన రాఘవ లారెన్స్.. ప్రస్తుతం 'కాంచన 4' తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే! లారెన్స్ హీరోగా నటిస్తూ.. తెరకెక్కిస్తున్న చిత్రం. ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉంది. ఇందులో పూజా హెగ్డే, నోరా ఫతేహి ప్రధాన పాత్రధారులుగా నటిస్తున్నారు. ఇప్పుడు ఈ చిత్రంలో రష్మికను ఓ ప్రత్యేక పాత్ర కోసం చిత్ర బృందం సంప్రదించారని తెలిసింది. ఇప్పటికే చర్చలు కూడా పూర్తయ్యాయట. ప్రస్తుతం రష్మిక నటించిన తెలుగు సినిమా 'ది గర్ల్ ఫ్రెండ్' కూడా విడుదలకు సిద్ధమవుతుంది.

## వరుణ్ సందేశ్..
# కానిస్టేబుల్ ట్రైలర్




గత సంవత్సరం రెండు విభిన్నచిత్రాలతో అలరించిన వరుణ్ సందేశ్ కథానాయకుడిగా రూపొందించిన కొత్త సినిమా 'కానిస్టేబుల్' మధులిక వారణాసి కథానాయికగా నటించగా రవి వర్మ, మురళీ ధర్ గౌడ్ ప్రధాన పాత్రల్లో నటించారు. ఆర్యన్‌సుభాన్ ఎస్.కే దర్శకత్వంలో బలగం జగదీశ్ నిర్మించారు. ఇప్పటికే విడుదల చేసిన పాట మంచి స్పందనను తీసుకు వచ్చింది. ఈ నేపథ్యంలో తాజాగా ఈ సినిమా ట్రైలర్ రిలీజ్ చేశారు.ఔట్ అండ్ ఔట్ క్రైమ్ ఇన్వెస్టిగేషన్ థ్రిల్లర్‌గా ఈ చిత్రం రూపొందినట్లు ఈ మూవీ ట్రైలర్‌ను చూస్తే అర్థమవుతోంది. ఓ ప్రాంతంలో వరుస హత్యలు జరుగడం, అప్పుడే కొత్తగా విధుల్లోకి వచ్చిన కానిస్టేబుల్ ఈ కేసు విషయంలో ఆసక్తి చూపడం తదనంతరం జరిగిన పరిణామాలు, ఎందుకు హత్యలు చేస్తున్నారు, ఎంతమంది ఉన్నారు, హీరో ఎలా ఎదుర్కొన్నాడనే కథకథనాల నేపథ్యంలో సినిమా మంచి థ్రిల్లింగ్ జానర్‌లో సాగనుంది. అయితే.. ప్రొడక్షన్ స్టాండర్డ్స్ విషయంలో చాలా వెనుకబడ్డట్టు స్పష్టంగా అర్థమవుతోంది.

## 21 ఏళ్ల తర్వాత కలిసి సందడి చేసిన
## దొంగ దొంగది జంట.. ప్రోమో వైరల్



2004లో వచ్చిన దొంగ దొంగది చిత్రం ఎంత పెద్ద హిట్ అయిందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. మంచు మనోజ్, సదా జంటగా నటించిన ఈ చిత్రం ప్రేక్షకులకి మంచి వినోదం పంచింది. తెరపై వారి కెమిస్ట్రీ, కామెడీ టైమింగ్‌కు అదిరిపోయే స్పందన వచ్చింది. ఈ ఇద్దరు కలిసి పని చేస్తూ చూడాలని ఫ్యాన్స్ భావించారు. కాని ఆ తర్వాత వీరు కలిసి ఏ వేదికపై కూడా కనిపించలేదు. ఇన్నేళ్ల తర్వాత ఒకే ఈవెంట్‌లో కలిసి కనిపించడం ఫ్యాన్స్‌కి ట్రీట్‌లా మారింది. హీరో మంచు మనోజ్ ఇటీవల రీ-ఎంట్రీ ఇచ్చి వరుస ప్రాజెక్టులతో బిజీగా ఉన్న సంగతి తెలిసిందే.ఈ క్రమంలో, ఇటీవల జీ తెలుగు నిర్వహించిన వినాయక చవితి స్పెషల్ ఈవెంట్ 'గం గం గణేశా' కి మనోజ్ హాజరయ్యాడు. ఈ కార్యక్రమానికి మరో సర్ప్రైజ్ గెస్ట్‌గా హీరోయిన్ సదా కూడా వచ్చి సందడి చేసింది. ఈ స్పెషల్ కార్యక్రమంలో మనోజ్, సదా ఇద్దరూ గేమ్స్ ఆడి, పంచులేస్తూ, సందడిగా హావభావాలతో అలరించారు. ఇద్దరూ ఒకరినొకరు హత్తుకొని పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. వీరి మధ్య జరిగిన నవ్వులు, చిలిపి మాటలు ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి.ఈ షో ప్రోమో ఇప్పటికే సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. పూర్తి ఎపిసోడ్ నేడు, ఆదివారం సాయంత్రం 6 గంటలకు జీ తెలుగు ఛానల్ లో ప్రసారం కానుంది. ఇన్నాళ్ల తర్వాత మళ్లీ కలసిన మనోజ్ – సదా జంటను తెరపై చూడడం ఫ్యాన్స్‌కి మధురానుభూతిని కలిగిస్తోంది.

"మళ్లీ ఈ ఇద్దరూ కలిసి నటిస్తే ఎంత బాగుంటుందో!" అంటూ అభిమానులు కామెంట్లు చేస్తున్నారు. మంచు మనోజ్ ఇటీవల భైరవం అనే సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చాడు. ఈ చిత్రం మల్టీ స్టారర్‌గా రూపొంది మంచి విజయం సాధించింది. మిరాయ్ అనే చిత్రంలో కూడా కీలక పాత్ర పోషించాడు మనోజ్. ఇటీవల గ్లింప్స్ విడుదల కాగా, ఇందులో మనోజ్ పాత్ర ప్రేక్షకులకి ఎంతగానో నచ్చేసింది.

## దుబాయ్ బిజినెస్‌మెన్ ప్రేమలో
# ఈ యంగ్ బ్యూటీ ఎలా పడిందంటే..!

టాలీవుడ్ బ్యూటీ నివేదా పేతురాజ్ రీసెంట్‌గా తన ప్రేమ విషయాన్ని అధికారికంగా ప్రకటించింది. వినాయక చవితి పండుగను పురస్కరించుకుని, దుబాయ్‌కు చెందిన వ్యాపారవేత్త రజిత్ ఇబ్రాన్‌తో రిలేషన్‌లో ఉన్నానని సోషల్ మీడియా ద్వారా వెల్లడించింది. ఈ ప్రకటనా అనంతరం సినీ ప్రముఖులు, అభిమానులు ఆమెకు శుభాకాంక్షలు తెలుపుతున్నారు. అయితే నివేదా తాజాగా తన ప్రేమాయణంకి సంబంధించిన ఆసక్తికర విషయాలు వెల్లడించింది. ఐదేళ్ల క్రితం దుబాయ్‌లో నిర్వహించిన ఓ రేసింగ్ ఈవెంట్‌లో రజిత్‌ను మొదటిసారి కలిశాను. మొదట మేము మంచి స్నేహితులుగా ప్రారంభించాము. ఆపై సమయం గడుస్తూ అభిప్రాయాలు కలవడం, మనసులు దగ్గర కావడంతో ప్రేమలో పడిపోయాము. మా రిలేషన్ గురించి చాలా తక్కువ మందికే తెలుసు. ఇండస్ట్రీలో కూడా ఈ విషయం ఎవరికీ తెలియదు. ఇప్పుడు అకస్మాత్తుగా ఈ విషయాన్ని బయటపెట్టడంతో నా మేనేజర్ కూడా షాక్ అయ్యాడు అని చెప్పింది. ఈ ఏడాది అక్టోబర్‌లో మేం ఎంగేజ్‌మెంట్ చేసుకోబోతున్నాం. పెళ్లి జనవరిలో ప్లాన్ చేస్తున్నాం. తుది తేదీ ఇంకా ఫిక్స్ కాలేదు కానీ, పెళ్లి పనులు మొదలుపెట్టేశాం. మా ఇరు కుటుంబాలు ప్రస్తుతం దుబాయ్‌లో ఉన్నాయి. మేము సింపుల్‌గా, కుటుంబ సభ్యులు, సన్నిహితుల మధ్య పెళ్లిని జరుపుకుంటాం అని నివేదా వివరించింది. మధురైలో జన్మించి పెరిగిన నివేదా, 'మెంటల్ మదిలో' సినిమాతో తెలుగు ఇండస్ట్రీలో హీరోయిన్‌గా అడుగుపెట్టింది. అనంతరం 'చిత్రలహరి', 'బ్రోచేవారేవరురా', 'అల వైకుంఠపురములో', 'రెడ్', 'పాగల్', 'విరాటపర్వం', 'దాస్ కా ధమ్కీ' వంటి సినిమాల్లో నటించింది. సినిమాల పరంగా టాలెంట్ ఉన్నప్పటికీ, ప్రస్తుతం ఆమె చేతిలో కొత్త ప్రాజెక్టులు లేనట్లు తెలుస్తోంది. కార్ రేసింగ్, బ్యాడ్మింటన్ వంటి క్రీడల్లోనూ ఆమె ప్రత్యేక ఆసక్తి కలిగి ఉంది. ఇకపై ఆమె వ్యక్తిగత జీవితం కొత్త అధ్యాయానికి తెరలేవనుంది. పెళ్లి తర్వాత నివేదా సినిమాలు చేస్తుందా లేదా అనేది చూడాలి.



# జియో సిమ్ రాక ముందు కథ ఇది..
## నవ్వులు పూయించేలా 'లిటిల్ హార్ట్స్' ట్రైలర్




90స్ మిడిల్‌క్లాస్ బయోపిక్ ఫేమ్ మౌళి తనుజ్, శివాని నాగరం ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం 'లిటిల్ హార్ట్స్'. ఈ రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌కు సాయి మార్తాండ్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈటీవీ విన్ ఒరిజినల్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై ఆదిత్య హాసన్ నిర్మించిన ఈ చిత్రాన్ని బన్నీ వాసు, వంశీ నందిపాటి థియేటర్లలో విడుదల చేస్తున్నారు. సెప్టెంబర్ 5న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా ట్రైలర్‌ను విడుదల చేసింది చిత్రయూనిట్. జియో సిమ్ రాకముందు జరిగిన కథగా ట్రైలర్ ఆసక్తికరంగా మొదలవుతుంది. సైనిక్‌పురిలో నివసించే అఖిల్, వాయుపురిలో ఉండే కాత్యాయని మధ్య సాగే ప్రేమకథ ఇది. చదువులో వెనుకబడిన విద్యార్థులైన వీరి ప్రేమకు ఇరు కుటుంబాల నుండి ఎదురైన అభ్యంతరాలు, చివరికి అఖిల్, కాత్యాయని ఒక్కటయ్యారా లేదా అనే అంశాలతో ఈ కథ నడుస్తుంది. ట్రైలర్ చూస్తుంటే, ఇందులో కామెడీతో పాటు ఎమోషనల్ సీన్స్ కూడా ఉన్నాయని తెలుస్తోంది. రాజీవ్ కనకాల, ఎస్.ఎస్. కాంచి, అనిత చౌదరి, సత్య కృష్ణన్ వంటి ప్రముఖ నటులు ఈ సినిమాలో కీలక పాత్రలు పోషించారు.

సింజిత్ యెర్రమల్లి సంగీతం అందించగా, సాయి మార్తాండ్ రచన, దర్శకత్వ బాధ్యతలు నిర్వర్తించారు. ఈ సినిమాలోని సంభాషణలు ప్రత్యేకంగా ఆకట్టుకుంటాయని తెలుస్తోంది.

# ఉస్తాద్ భగత్ సింగ్ నుండి
## అదిరిపోయే పోస్టర్.. ఇక జాతర మొదలు

మొన్నటి వరకు రాజకీయాలతో బిజీ బిజీగా ఉన్న పవన్ కళ్యాణ్ తాను కమిటైన ప్రాజెక్ట్‌లకి బ్రేక్ వేశాడు. ఇటీవల ఒక్కొక్కటి పూర్తి చేస్తూ దూసుకుపోతున్నాడు. హరిహర వీరమల్లు చిత్రం కొద్ది రోజుల క్రితం విడుదల కాగా, ఈ మూవీ అభిమానులని కూడా ఏ మాత్రం అలరించలేకపోయింది. ఇక ఓజీ చిత్రం సెప్టెంబర్ 25న విడుదల కానుంది. ఈ మూవీ కోసం ఫ్యాన్స్ ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. అయితే పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ సినిమాల క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఆయన ఏ ప్రాజెక్ట్ ప్రకటించినా అది అభిమానులకే కాదు, టాలీవుడ్ మొత్తానికి ఉత్సాహాన్ని కలిగిస్తుందన్న విషయంలో సందేహం లేదు. ఇప్పుడు అదే స్థాయిలో హైప్ తెచ్చుకుంటున్న సినిమా "ఉస్తాద్ భగత్ సింగ్".ఈ చిత్రానికి హరీష్ శంకర్ దర్శకత్వం వహిస్తున్నారు. ఒకప్పుడు గబ్బర్ సింగ్ వంటి బ్లాక్‌బస్టర్ హిట్ ఇచ్చిన ఈ కాంబో మళ్లీ కలిసి వస్తుండటంతో అంచనాలు ఆకాశాన్నంటుతున్నాయి. ఫ్యాన్స్ అయితే ఈ సినిమాను ఒక పండుగలా భావిస్తున్నారు. సెప్టెంబర్ 2న పవన్ కళ్యాణ్ పుట్టినరోజు. ప్రతి సంవత్సరం లాగే ఈసారి కూడా ఫ్యాన్స్ ముందుగానే పండుగను స్టార్ట్ చేశారు. కటౌట్లు, ఫ్లెక్సీలు, బ్లడ్ డొనేషన్లు, సోషల్ సర్వీస్ కార్యక్రమాలు మొదలైపోయాయి. ఈ వేడుకలో మేకర్స్ కూడా భాగమవుతూ, ఒకటి తర్వాత ఒకటి సర్ప్రైజ్ గిఫ్ట్స్ ఇస్తున్నారు. తాజాగా విడుదల చేసిన ప్రీ-లుక్ పోస్టర్ ఈ జోష్‌కు మరింత బలాన్నిచ్చింది. ఈ పోస్టర్‌లో పవన్ కళ్యాణ్ ఒక సాంగ్ షూట్ లుక్‌లో కనిపించగా, ఆయన వింటేజ్ మాస్ స్టైల్, ఎనర్జీ ఫ్యాన్స్‌ను



ఫుల్ ఖుషీ చేసింది.ఈ లుక్‌లోని కాస్ట్యూమ్, పవన్ బాడీ లాంగ్వేజ్ అంతా అభిమానుల్లో ఫుల్ జోష్ కలిగిస్తుంది. సోమవారం సాయంత్రం 4:45 గంటలకు మేకర్స్ "ఫుల్ మీల్స్" అంటూ హైప్ క్రియేట్ చేయడం చూస్తుంటే, ఈ మూవీ కూడా సూపర్ డూపర్ హిట్ కావడం ఖాయం అంటున్నారు. హరీష్ శంకర్ – పవన్ కలయిక అంటేనే ఫ్యాన్స్‌కు ప్రత్యేకమైన అంచనాలు ఉంటాయి. "గబ్బర్ సింగ్"లో ఆయన పవన్ మాస్ ఇమేజ్‌ని ఎలా వాడుకున్నారో అందరికీ గుర్తే. ఇప్పుడు మళ్లీ అదే డైరెక్టర్ చేతిలో పవన్ పడడంతో ఈ సినిమా ఫుల్ మాస్ ఎంటర్టైనర్గా వస్తుందన్న ఆశలు పెరిగిపోయాయి. సంగీతం దేవి శ్రీ ప్రసాద్ అందిస్తున్నారు. సినిమాటోగ్రఫీ, ఆర్ట్ డైరెక్షన్, యాక్షన్ సీక్వెన్సుల విషయంలో మేకర్స్ భారీగా ఖర్చు చేస్తున్నారని సమాచారం. పవన్ కళ్యాణ్ స్టామినాకు తగ్గ రీతిలో గ్రాండ్ విజువల్స్ చూపించేందుకు అన్ని విభాగాలూ జాగ్రత్తలు తీసుకుంటున్నాయట. "ఉస్తాద్ భగత్ సింగ్" సినిమా పవన్ అభిమానుల కోసం ఒక ఫుల్ మాస్ ఫెస్టివల్‌గా మారుతోంది.

## పేకాటరాయుళ్ళను పట్టుకున్న

# టౌన్ ఇన్స్పెక్టర్ కరుణాకర్

**-రూ.95150/- నగదు స్వాధీనం**



జగిత్యాల జిల్లా (ప్రశ్న న్యూస్) జగిత్యాల పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలోని విద్యానగర్ లో ఓ ఇంట్లో పేకాట ఆడుతున్నారని పక్కా సమాచారం అందిన మేరకు టౌన్ ఇన్స్పెక్టర్ కరుణాకర్ తన సిబ్బందితో పాటు వెళ్లి పేకాట ఆడుతున్న 11 మందిని పట్టుకుని వారి వద్ద నుండి రూ.95150/- నగదు స్వాధీనం చేసుకుని, పేకాట రాయుళ్ళను పోలీస్ స్టేషన్కు తరలించి వారందరి పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

## మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసు విభాగం కృషి అభినందనీయం

**- బోయినిపల్లి ఏఎంసీ చైర్మన్ : బోయిని ఎల్లేష్ యాదవ్**

**- బోయినిపల్లి నూతన ఎస్సై రమాకాంత్ కు ఘన సన్మానం - శుభాకాంక్షలు**



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి సబ్ ఇన్స్పెక్టర్గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన రమాకాంత్‌ను బోయినిపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బోయిని ఎల్లేష్ యాదవ్ మర్యాదపూర్వకంగా కలిసి, శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా చైర్మన్ బోయిని ఎల్లేష్ మాట్లాడుతూ, “మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు పోలీసు విభాగం కృషి అభినందనీయమైనది. నూతన ఎస్సై రమాకాంత్ ఆధ్వర్యంలో చట్టం వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని మేము విశ్వసిస్తున్నాం. సమాజంలో నేరాలను అరికట్టడంలో పోలీసులకు ప్రజలతో పాటు మేము కూడా పూర్తి స్థాయిలో సహకరిస్తాం” అని అన్నారు. వారి వెంట మాజీ ఉపసర్పంచ్ పిట్టల మోహన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు బోయిని మల్లేశం, నల్ల మోహన్, బోయిని పరుశరాం, గుంటి జలంధర్, మెరుపుల జలంధర్, గంగిపల్లి మొండయ్య, గుంటి తిరుపతి, నక్క శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

## బిఆర్ఎస్ పార్టీలో నూతనోత్సాహం

**- జూలూరుపాడు మండల బిఆర్ఎస్ అధ్యక్షులుగా రాంమూర్తి**

**- రాంమూర్తి ఏకగ్రీవంతో బిఆర్ఎస్ పార్టీ శ్రేణుల సంబరాలు**





జూలూరుపాడు (ప్రశ్న న్యూస్) జూలూరుపాడు బిఆర్ఎస్ పార్టీ నూతన మండల అధ్యక్షుడిగా చాపల మడుగు రామ్మూర్తి ఏకగ్రీవంగా ఎన్నికవడంతో జూలూరుపాడు మండల బిఆర్ఎస్ పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహం వచ్చిందని బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు యల్లంకి సత్యనారాయణ, లకావత్ గిరిబాబు అన్నారు. మండల కేంద్రంలోని ఆదివారం ఏవిఆర్ ఫంక్షన్ హాల్లో బిఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఖమ్మం మరియు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు తాతా మధుసూదన్, రేగా కాంతారావుల ఆదేశాల మేరకు జూలూరుపాడు మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడిగా చాపల మడుగు రామ్మూర్తి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రామ్మూర్తి మాట్లాడుతూ మాట్లాడుతూ జూలూరుపాడు మండల అధ్యక్షుడిగా తనపై నమ్మకంతో పార్టీ బాధ్యతలు అప్పజెప్పిన కెసిఆర్, కేటీఆర్, హరీష్ రావు, ఖమ్మం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల అధ్యక్షులు తాతా మధుసూదన్, రేగా కాంతారావు, యల్లంకి సత్యనారాయణ, గిరిబాబు లకు రుణపడి ఉంటానని తెలుపుతూ. జూలూరుపాడు మండల ప్రజల్లోకి మరింత విస్తృతంగా పార్టీని తీసుకెళ్లేందుకు, గ్రామస్థాయిలో పార్టీ కార్యకలాపాలను మరింత ఉత్సాహంగా కొనసాగించి రాబోయే లోకల్ ఎలక్షన్లలో బీఆర్ఎస్ ను ముందు వరుసలో ఉంచుతానన్నారు. బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు నాకు ఈ బాధ్యతను ఇచ్చినందుకు మండల వ్యాప్తంగా దృఢనిబద్ధతను కలిగి పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని అన్నారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, చాపల మడుగు రామ్మూర్తి కీ అభినందనలు తెలిపారు.

## గణనాథుని సేవలో మై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు - మధు మహేష్

**- డాక్టర్ మధు మహేష్ ను ఘనంగా సన్మానించిన శ్రీ వేణుగోపాల స్వామి యూత్ సభ్యులు**



వేములవాడ (ప్రశ్న న్యూస్) వేములవాడ మున్సిపల్ పరిధిలోని 21 వ వార్డులో, శ్రీ వేణుగోపాల స్వామి యూత్ సభ్యుల ఆధ్వర్యంలో కొలువుదీరిన శ్రీ గణనాథుని దర్శనార్థం ఆదివారం విచ్చేసిన పట్టణానికి చెందిన,”మై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్” నిర్వాహకులు డాక్టర్ మధు మహేష్ ను శ్రీ వేణుగోపాల స్వామి యూత్ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా యూత్ సభ్యులు ఆయనకు శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా యూత్ సభ్యులు మాట్లాడుతూ, డాక్టర్ మధు మహేష్ సమాజ సేవలో విశేష కృషి చేస్తున్నారు. ముఖ్యంగా విద్య, ఆరోగ్య రంగాల్లో నిరుపేదలకు చేయూతనిస్తూ, అనేక సేవా కార్యక్రమాలను విజయవంతంగా కొనసాగిస్తున్నారు. అలాగే దాతల సహకారంతో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన సేవలు అత్యంత ప్రశంసనీయం అని కొనియాడారు. అనంతరం డాక్టర్ మధు మహేష్ మాట్లాడుతూ, సేవే మాకు ప్రధాన ధ్యేయం. భవిష్యత్తులో దాతల సహకారంతో, ట్రస్ట్ సభ్యుల సమన్వయంతో మరిన్ని సేవా కార్యక్రమాలతో ముందుకు సాగుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీ వేణుగోపాల స్వామి యూత్ సభ్యులు పాల్గొన్నారు.

## చిన్నారుల అల్లరి సంబురాల్లో - గణనాథుడు గంగమ్మ ఒడిలో

**- గణేశునికి వీడ్కోలు పలికిన చిన్నారులు**



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) బోయినిపల్లి మండలం, నీలోజిపల్లి గ్రామం ఆదివారం పసివారి కేరింతలతో మార్మోగింది. గణేశ్ నవరాత్రి ఉత్సవాల ఐదో రోజు గణపతిని ఊరేగింపుగా తీసుకెళ్లిన చిన్నారులు పాటలు పాడుతూ, డప్పుల తాళానికి తాళం వేసి నృత్యాలు చేస్తూ అందరినీ ఆకట్టుకున్నారు. ముఖాల్లో ఆనందం, కళ్లల్లో భక్తి మెరుస్తూ గంగమ్మ చెరువువైపు సాగిన పిల్లలు చివరికి గణనాథుని నిమజ్జనం చేసి సంతోషంతో మురిసిపోయారు. పసివారి అల్లరి, భక్తి కలిసిన ఈ ఊరేగింపు నీలోజిపల్లికి పండుగ వాతావరణాన్ని తీసుకొచ్చింది.

# భక్తుల సౌకర్యాల కోసం

**రాజన్న ఆలయంలో శరవేగంగా అభివృద్ధి పనులు**

**ఆలయ ఈఓ : ఎల్. రమాదేవి**



వేములవాడ (ప్రశ్న న్యూస్)వేములవాడ శ్రీ పార్వతి రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో భక్తుల సౌకర్యార్థం అభివృద్ధి పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. ఆలయ పరిసరాల్లో ఓపెన్ స్లాబ్ మార్పు నిర్మాణం జరుగుతోంది. ఇందులో నిత్యకళ్యాణం, చండీ హోమం, సత్యనారాయణ స్వామి వ్రతం వంటి వివిధ పూజా కార్యక్రమాలు సులభంగా నిర్వహించుకునేలా ప్రత్యేక సదుపాయాలు కల్పిస్తున్నారు. ఈ పనులను ఆలయ కార్యనిర్వాహక అధికారి (ఈఓ) ఎల్. రమాదేవి స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. భక్తులు ఎటువంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా సౌకర్యవంతమైన వాతావరణం ఉండేలా తగిన మార్పులు చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. భవిష్యత్తులో మరిన్ని సదుపాయాలు ఏర్పాటు చేసి వేములవాడ ఆలయాన్ని ఆధునిక సౌకర్యాలతో తీర్చిదిద్దే దిశగా ప్రయత్నాలు కొనసాగుతాయని ఈఓ రమాదేవి తెలిపారు.

## రాజన్నాలయ ఈఓ రమాదేవిని కలిసిన కాంగ్రెస్ నేతలు



వేములవాడ (ప్రశ్న న్యూస్) వేములవాడ శ్రీ రాజరాజేశ్వరస్వామి దేవస్థానం కార్యనిర్వహణాధికారిగా శనివారం బాధ్యతలు స్వీకరించిన ఎల్. రమాదేవిని ఆదివారం వేములవాడ పట్టణ కాంగ్రెస్ పార్టీ నేతలు మర్యాదపూర్వకంగా కలిసి, పూలమొక్కను అందజేసి, శుభాకాంక్షలు తెలియజేశారు. ఈఓ ను కలిసిన వారిలో నాయకులు పులి రాంబాబు, ముప్పిడి శ్రీధర్, పులి రాహుల్, సాయి ఉన్నారు.

## ప్రాంతీయ ఆసుపత్రి వైద్యులను అభినందించిన ప్రభుత్వ విప్ ఆది



వేములవాడ (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, వేములవాడ ప్రాంతీయ ప్రభుత్వ ఆసుపత్రి వైద్య బృందాన్ని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అభినందించారు. ఆదివారం ఆసుపత్రిలో నాలుగు మోకాళ్ల మార్పిడి శస్త్రచికిత్సలు విజయవంతంగా పూర్తి చేసిన సందర్భంగా ఆయన వైద్యులను ప్రశంసించారు. ఇప్పటి వరకు ఆసుపత్రిలో 48 మోకాళ్ల మార్పిడి ఆపరేషన్లు నిర్వహించగా, ప్రస్తుతం మరో 100 మంది రోగులు శస్త్రచికిత్స కోసం ఎదురుచూస్తున్నారని ఆయన తెలిపారు. ఇకపై క్రమం తప్పకుండా ఇలాంటి ఆపరేషన్లు నిర్వహించాలని వైద్యులకు సూచించారు. ప్రజలు ప్రభుత్వ ఆసుపత్రి అందిస్తున్న ఆధునిక వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని విప్ ఆది శ్రీనివాస్ ప్రజలకు పిలుపునిచ్చారు.

## గణనాధుని ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలి: వేణుగోపాల్ రాజు



అంబర్ పేట (ప్రశ్న న్యూస్) అంబర్ పేట డివిజన్ పటేల్ నగర్ లో శ్రీ మహాలక్ష్మి కాలనీలో బాల గణేష్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నవరాత్రి ఉత్సవంలో భాగంగా గణనాధునికి పూజా కార్యక్రమాలు నిర్వహించిన ఓంకారం వేణుగోపాల్ రాజు ఈ సందర్భంగా మాట్లాడుతూ గణనాథుని ఆశీస్సులతో ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని ఈ సందర్భంగా అన్నారు. ఈ పూజా కార్యక్రమంలో ఓంకారం సహదేవరాజు, వరకవి భరణిదర్ రాజు, ఓంకారం సాయి చరణ్ రాజు, నిర్మల, స్వర్ణలత, వీణా, శ్వేత, సాహితీ, నాగులు, మారుతి, రమేష్, కృష్ణ, శ్రీనివాస్, తదితరులు పూజ కార్యక్రమం పాల్గొన్నారు.

## రాజన్న యూత్ ఆధ్వర్యంలో ఘనంగా కుంకుమపూజ..! అన్నదాన సేవలు..!!



వేములవాడ (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, వేములవాడ పట్టణంలోని బద్దిపోచమ్మ ప్రాంతంలో రాజన్న యూత్ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం భక్తిశ్రద్ధలతో కుంకుమపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా గణపతి విగ్రహం సమక్షంలో సుహాసినులు కుంకుమ, పుష్పాలతో ప్రత్యేక పూజలు చేశారు. పూజ అనంతరం యూత్ కమిటీ సభ్యులు అన్నదాన కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. వందలాది మంది భక్తులకు ప్రసాదాన్ని పంపిణీ చేస్తూ, సమాజ సేవలో యువత ముందుండాలనే సంకల్పాన్ని నిర్వాహకులు వ్యక్తం చేశారు. కార్యక్రమానికి స్థానికులు, భక్తులు విశేషంగా స్పందించారు. భవిష్యత్తులో మరిన్ని సామాజిక సేవా కార్యక్రమాలను చేపట్టనున్నట్లు రాజన్న యూత్ కమిటీ సభ్యులు తెలిపారు.

## తాగునీరు సమస్య పరిష్కారానికి బోరు ఏర్పాటు

**- నూకలమర్రిలో బోరు మోటారుకు భూమి పూజ**

**- విప్, ఎమ్మెల్యే : ఆది శ్రీనివాస్ కు గ్రామస్తుల కృతజ్ఞతలు**



వేములవాడ (ప్రశ్న న్యూస్) వేములవాడ నియోజకవర్గంలోని నూకలమర్రి గ్రామ ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఆదివారం బోరు మోటారుకు భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో త్రాగునీటి సమస్యను పరిష్కరించేందుకు బోరు ఏర్పాటు చేయడానికి సహకరించిన వేములవాడ శాసనసభ సభ్యులు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కు గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వేములవాడ రూరల్ మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వకులాభరణం శ్రీనివాస్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు రోమాల ప్రవీణ్, గ్రామ శాఖ అధ్యక్షులు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ పాలకుర్తి పరశురామ్, మాజీ ఎంపిటిసి బొడ్డు శంకరవ్వ - రాములు, మాజీ సర్పంచ్ పిట్టల వెంకటేశం, సీనియర్ నాయకులు మొండి మల్లయ్య, సామల్ల రాజు, ఈర్య నాయక్, ఇందిరమ్మ కమిటీ సభ్యుడు పొత్తూరి నరసయ్య, గూగులోతు భులమ్మ, సోమినేని బాలు, పాలకుర్తి సుమిత్, రోమాల బక్కయ్య, దొంతుల మల్లేష్, రోమాల ప్రశాంత్, యూత్ కాంగ్రెస్ కోఆర్డినేటర్ సామల్ల రజనీకాంత్, నూకలమర్రి గ్రామ కాంగ్రెస్ కుటుంబ సభ్యులు పాల్గొని భూమి పూజను విజయవంతం చేశారు.

# అక్రమ నిర్మాణాలలో పద్మారావు నగర్

- కాసులు తీసుకొని మౌనంగా ఉంటున్న టౌన్ ప్లానింగ్ సిబ్బంది, అధికారులు
- అవినీతి అధికారులపై చర్యలు తీసుకోవడంలో విఫలమైన ఏసీబీ, విజిలెన్స్
- బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్న జోనల్ కమిషనర్, డిప్యూటీ కమిషనర్
- అక్రమ నిర్మాణాలను సీజ్ చేయాలని సర్క్యులర్ ఉన్న లెక్కచేయని ఏసీపీలు
- సికింద్రాబాద్ జోన్ పరిధిలో చర్యలకు జోనల్ కమిషనర్, సిసిపి నిర్లక్ష్యం







**సికింద్రాబాద్ (ప్రశ్న న్యూస్)** బేగంపేట సర్కిల్ పరిధిలో అక్రమ నిర్మాణాల పరంపర కొనసాగుతుంది. గత చైన్ మెన్ల అవినీతి ఇంకా కొనసాగుతూనే ఉంది. చైన్ మెన్లు సర్కిల్ మారిన వాళ్ల అవినీతి మాత్రం అస్సలు మారలేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికి స్థానికంగా పద్మారావు నగర్లో విధులు నిర్వహించిన చైన్ మెన్ జగదీష్ కనుసైగల్లోనే అనేక అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఆయన అవినీతి అంతా ఇంత లేదని అవినీతి సొమ్ముతో కోట్లల్లో ఉన్నాడన్న ఆరోపణలు ఉన్నాయి. ఇతనిపై గతంలో ఏసీబీ దాడులు చేయాలని స్థానిక ప్రజాప్రతినిధులు సైతం పలుసార్లు ఫిర్యాదులు చేసిన ఎందుకు ఏసీబీ అధికారులు, విజిలెన్స్ అధికారులు చర్యలు తీసుకోవడం లేదో అర్థం కాని పరిస్థితి నెలకొన్నది. పద్మారావు నగర్ పరిధిలో ఇప్పటికీ జరుగుతున్న అనేక అక్రమ నిర్మాణాలలో చైన్ మెన్ జగదీష్ హస్తము ఉందని చాలా వాటికి నోటీసులు ఇవ్వకుండా అక్రమ నిర్మాణదారులతో చేతులు కలిపి ఉన్నతాధికారులకు లంచాలు ఇస్తూ మేనేజ్ చేశారని అధికారులు కూడా డబ్బులు వస్తున్నాయని చైన్ మెన్ లను ప్రోత్సహిస్తున్నారు. ఇలా సెక్షన్ ఆఫీసర్, ఎసిపి, డిప్యూటీ కమిషనర్, జోనల్ కమిషనర్లు చైన్ మెన్ లు ఇచ్చే అక్రమ వాటాలకు దాసోహమై వాళ్ళు చెప్పినట్టు వింటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. అదే విధంగా సికింద్రాబాద్ జోన్ పరిధిలో ఇప్పటికీ అనేక అక్రమ నిర్మాణాలు చైన్ మెన్ ల కనుసైగల్లో జరుగుతున్నాయని అధికారులు కేవలం చోద్యం చూడడం లంచాలు తీసుకోవడం తప్ప చర్యలు తీసుకొని సీజ్ చేయాలన్న ఆలోచన లేదని కమిషనర్ అక్రమ నిర్మాణాలను సీజ్ చేయాలని సర్క్యులర్ జారీ చేసిన గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఒక్క ఏసీపీ కూడా సీజ్ చేయకపోవడం చూస్తుంటే ఒక్కొక్క ఏసీపీకి ఎంత భారీ స్థాయిలో అక్రమ నిర్మాణాల నుండి లంచాలు అందుతున్నాయో కమిషనర్ కె తెలియాలి. ఆయన ఆదేశాలను కూడా బుట్ట దాఖలు చేస్తున్నారంటే కమిషనర్ ఉండి ఎవరికి ఉపయోగమని వాళ్ళ సిబ్బంది ఆయన ఆదేశాలను లెక్కచేయనప్పుడు కమిషనర్ ఏసీపీ లపై చర్యలు తీసుకోకపోవడం విడ్డూరంగా మారింది. బేగంపేట సర్కిల్ పరిధిలో పద్మారావు నగర్ నందు పక్కింటి నెంబర్ 6-1-131 వద్ద ఓ భారీ అక్రమ నిర్మాణం జరుగుతుందని స్థానికులు ఫిర్యాదు చేయడంతో పాటు కొన్ని పత్రికలలో కథనాలు వచ్చిన ఇప్పటివరకు నోటీసులు జారీ చేయకపోవడం నిర్మాణ పనులు ఆపకపోవడం చూస్తుంటే అధికారులకు, సిబ్బందికి, న్యాక్ ఇంజనీర్లకు లంచాలు ఎంత భారీ స్థాయిలో అందుతున్నాయో అర్థం చేసుకోవచ్చు. ఈ అక్రమ నిర్మాణం పై చర్యలు తీసుకోవాలని స్థానికులు జిహెచ్ఎంసి కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న చర్యలు తీసుకున్న పాపాన పోవడం లేదని డిప్యూటీ కమిషనర్ కు, ఏసీపి కి కావలసింది ఇచ్చి ఇలా అక్రమ నిర్మాణాలను బిల్డర్లు చేస్తున్నారని ఆరోపించారు. ఎలాంటి సెట్ బ్యాక్ లు లేకుండా రోడ్డుపైకి వచ్చి మరి ఈ అక్రమ నిర్మాణం జరుగుతుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సికింద్రాబాద్ జోనల్ కమిషనర్ రవి కిరణ్ చర్యలు తీసుకుంటారో లేక నాకేమని వదిలేస్తారో వేచి చూడాలి.

# జిహెచ్ఎంసి పరిధిలో కలుషిత నీరు సరఫరా

**మేనేజర్ల నిర్లక్ష్యంతో కలిసిత నీరు తాగుతున్న ప్రజలు**

- కలుషిత నీరు తాగి ఆసుపత్రి పాలవుతున్న పట్టింపు లేని పాలకులు
- లాలాపేట, తార్నాక, మెట్టుగూడ ప్రాంతాలలో జోరుగా కలుషిత తాగునీరు సరఫరా
- వర్షం పడితే చాలు నగరంలో కలుషిత నీరు సరఫరా పట్టించుకోని జలమండలి ఉన్నతాధికారులు
- అధికారుల నిర్లక్ష్యంతోనే ప్రజలకు నిత్యం రోగాలు పట్టించుకోని జలమండలి ఎండి




**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఇటీవల కురిసిన వర్షాలకు డ్రైనేజీ వ్యవస్థ పూర్తిగా అస్తావ్యస్తంగా మారి చాలా చోట్ల తాగునీరు కలుషితమై వస్తుందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జలమండలి మేనేజర్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రజల ఫిర్యాదులపై అసలు స్పందించడం లేదని దానితో ప్రజలు కలుషిత నీరు తాగి రోగాల బారిన పడుతున్నారు. చాలావరకు నగర వ్యాప్తంగా జ్వరాలు, ఇన్ఫెక్షన్లతో ప్రజలు ఆస్పత్రులకు క్యూ కడుతున్నారు దీనికి కారణం ఒకపక్క వాతావరణం లో మార్పులు అయితే మరోపక్క కలుషిత నీరు తాగి రోగాల పాలవుతున్నారని ప్రతిపక్ష నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జలమండలి అధికారులు కలుషితనీరు రాకుండా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ప్రజల ఫిర్యాదులపై కూడా స్పందించడం లేదని దానితో తాగునీరులో రంగు మారిన నీరు డ్రైనేజీ వాటర్ కలుస్తున్నాయని ఇలా తార్నాక, లాలాపేట, మెట్టుగూడ, సికింద్రాబాద్, బేగంపేట ప్రాంతాలలో కలుషితనీరు సరఫరా జరుగుతున్నట్టు ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జలమండలి మేనేజర్ల దృష్టికి సమస్యను తీసుకువచ్చిన తీర్చడం లేదని కేవలం నామమాత్రంగా పరీక్షించి చేతులు దులుపుకుంటున్నారు

తప్ప శాశ్వత పరిష్కారం చూపడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇక జలమండలి పరిధిలో అక్రమంగా ట్యాంకర్ల సప్లై జరుగుతుందని మ్యాన్ హెూల్ మరమ్మతులలో భారీగా అవినీతి జరుగుతూ నాసినకం మ్యాన్ హెూల్స్ నిర్మిస్తున్నారు. ఇందులో స్థానికంగా ఉంటున్న మేనేజర్ లు, డీజీఎం లో వాటాలు పంచుకొని మేనేజర్ కు ప్రతినెలా లంచాలు ఇస్తున్నారని అందుకోసమే జలమండలి పరిధిలో నిర్మిస్తున్న మ్యాన్ హెూల్స్ మూడు రోజుల ముచ్చటగా మారుతున్నాయని ఇలా నాసిరకం మ్యాన్ హెూల్స్ పైప్ లైన్ల పనులతో కలుషితనీరు సరఫరా అవుతున్నట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు.

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో చాలావరకు తాగునీరు కలుషితమై వస్తోంది. ఇప్పటికైన జలమండలి ఎండి స్పందించి తాగునీరు నాణ్యతను పెంచడంతోపాటు కలుషిత నీరు సరఫరా జరగకుండా చర్యలు తీసుకోవాలని రేవంత్ ప్రభుత్వం కూడా జలమండలి అధికారుల నిర్లక్ష్యం పై కఠినంగా వ్యవహరించాలని ప్రజలు కోరుతున్నారు.

# టీటీడీకి భారీ విరాళాలు

## – బర్డ్ ట్రస్టుకు ఒకేరోజు రూ.4 కోట్లు



తిరుమల (ప్రశ్న న్యూస్) తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఆధ్వర్యంలో నడిచే వివిధ ట్రస్టులకు విరాళాలు వెల్లువెత్తాయి. ఒకే రోజు ప్రముఖ సంస్థలు, వ్యక్తుల నుంచి కోట్లాది రూపాయలు విరాళంగా అందాయి. ముఖ్యంగా దివ్యాంగులకు సేవలందించే బర్డ్ (బాలాజీ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సర్జరీ, రీసెర్చ్ అండ్ రిహాబిలిటేషన్ ఫర్ ది డిసేబుల్డ్) ట్రస్టుకు భారీ మొత్తంలో విరాళాలు సమకూరాయి. వివరాల్లోకి వెళితే, హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ వాణిజ్య సంస్థ ఆర్.ఎస్.బి రీటైల్ ఇండియా లిమిటెడ్, టీటీడీ బర్డ్ ట్రస్టుకు రూ.2,92,91,840 (సుమారు రూ.2.93 కోట్లు) విరాళంగా సమర్పించింది. ఇదే క్రమంలో, ఆర్.ఎస్.బ్రదర్స్ జ్యూవెలరీస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ కూడా బర్డ్ ట్రస్టుకు రూ.1.10 కోట్ల భారీ విరాళాన్ని అందజేసింది. ఈ రెండు సంస్థల నుంచి బర్డ్ ఆసుపత్రికి కలిపి మొత్తం రూ.4 కోట్లకు పైగా విరాళం అందినట్లయింది. మరోవైపు, నరసరావుపేటకు చెందిన శ్రీ జె. రామాంజనేయులు అనే భక్తుడు శ్రీ వెంకటేశ్వర అన్నప్రసాదం ట్రస్టుకు తనవంతుగా రూ.10 లక్షలు విరాళంగా అందించారు. నిత్యం లక్షలాది మంది భక్తుల ఆకలి తీర్చే అన్నప్రసాదం పథకానికి ఆయన ఈ మొత్తాన్ని అందజేశారు. ఈ విరాళాలకు సంబంధించిన వివరాలను టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు స్వయంగా సోషల్ మీడియా వేదికగా పంచుకున్నారు. దాతల ఉదారతను ఆయన ఈ సందర్భంగా ప్రశంసించారు.

# పాఠ్యపుస్తకాల్లో ట్రాన్స్‌జెండర్ల అంశాలు

## – సుప్రీంకోర్టును ఆశ్రయించిన విద్యార్థిని



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) దేశవ్యాప్తంగా పాఠశాల విద్యార్థులకు బోధించే పాఠ్యాంశాల్లో ట్రాన్స్‌జెండర్ల హక్కులు, లింగ గుర్తింపు, లింగ సమానత్వం వంటి అంశాలను చేర్చాలని కోరుతూ సుప్రీంకోర్టులో ఒక ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలైంది. 12వ తరగతి చదువుతున్న కావ్య ముఖర్జీ అనే విద్యార్థిని ఈ వ్యాజ్యాన్ని దాఖలు చేయడం గమనార్హం. న్యాయవాది అనిల్ కుమార్ ద్వారా దాఖలు చేసిన ఈ పిటిషన్‌లో పలు కీలక అంశాలను ప్రస్తావించారు. ప్రస్తుతం ఎన్సీఈఆర్టీ, రాష్ట్రాల ఎస్సీఈఆర్టీలు రూపొందిస్తున్న పాఠ్యపుస్తకాల్లో లింగ గుర్తింపు, లింగ వైవిధ్యం వంటి సున్నితమైన అంశాలపై ఎలాంటి సమాచారం లేదని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఇది 2019 నాటి ట్రాన్స్‌జెండర్ వ్యక్తుల (హక్కుల పరిరక్షణ) చట్టానికి, గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలకు పూర్తిగా విరుద్ధమని వాదించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటక, పంజాబ్, తమిళనాడు సహా పలు రాష్ట్రాల పాఠ్యపుస్తకాలను సమీక్షించామని, కేరళ మినహా మిగతా అన్ని రాష్ట్రాల్లోనూ ఈ అంశాలను వ్యవస్థాగతంగా విస్మరించారని పిటిషన్‌లో తెలిపారు. ఇలాంటి సిలబస్ కారణంగా విద్యార్థుల్లో ట్రాన్స్‌జెండర్లపై అవగాహన లోపించి, వివక్ష, చిన్నచూపు పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత విధానం రాజ్యాంగంలోని ఆర్టికల్స్ 14, 15, 19, 21, 21%ూ%లను ఉల్లంఘించడమేనని స్పష్టం చేశారు. దేశంలో జాతీయ అక్షరాస్యత సగటు 74 శాతంగా ఉంటే, ట్రాన్స్‌జెండర్లలో ఇది కేవలం 57.06 శాతంగానే ఉందని గణాంకాలను ఉటంకించారు. సామాజిక వివక్ష, విధానపరమైన నిర్లక్ష్యం వల్లే ఈ దుస్థితి నెలకొందని పేర్కొన్నారు. దేశంలోని 23 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు ఎన్సీఈఆర్టీ పాఠ్యపుస్తకాలనే అనుసరిస్తున్నందున, ఈ అంశాలను సిలబస్‌లో చేర్చడం ద్వారా సామాజిక న్యాయం జరుగుతుందని వివరించారు. వయసుకు తగినట్లుగా, శాస్త్రీయబద్ధమైన సమాచారంతో ట్రాన్స్‌జెండర్ల అంశాలను పాఠ్యాంశాల్లో చేర్చేలా ఎన్సీఈఆర్టీ, ఎస్సీఈఆర్టీలను ఆదేశించాలని పిటిషనర్ కోరారు. ఈ వ్యాజ్యంపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కె. వినోద్ చంద్రన్‌లతో కూడిన ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టనుంది.

# జగన్ కు జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డి ఫోన్

## – నో చెప్పిన వైసీపీ అధినేత



అమరావతి (ప్రశ్న న్యూస్) ఉపరాష్ట్రపతి ఎన్నికల నేపథ్యంలో రాజకీయ పరిణామాలు వేగవంతమయ్యాయి. ఇండియా కూటమి తరపున ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా బరిలో ఉన్న జస్టిస్ సుదర్శన్‌రెడ్డి, వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు ఫోన్ చేశారు. ఈ ఎన్నికల్లో తనకు మద్దతు ఇవ్వాలని ఆయన జగన్‌ను కోరారు. జస్టిస్ సుదర్శన్‌రెడ్డి అభ్యర్థనకు జగన్ సున్నితంగా బదులిచ్చారు. ఇండియా కూటమి తమ అభ్యర్థిని ప్రకటించకముందే ఎన్డీయే నాయకులు తనను సంప్రదించారని, వారికి మద్దతు ఇస్తామని మాట ఇచ్చామని జగన్ వివరించారు. ఈ కారణంగా ఇప్పుడు మీకు (సుదర్శన్ రెడ్డికి) మద్దతు ఇవ్వలేకపోతున్నామని స్పష్టం చేశారు. అయితే, న్యాయమూర్తిగా జస్టిస్ సుదర్శన్‌రెడ్డి దేశానికి, ప్రజలకు అందించిన సేవలు ఎనలేనివని, ఆయనపై తనకు వ్యక్తిగతంగా అపారమైన గౌరవం ఉందని జగన్ పేర్కొన్నారు. ఈ పరిస్థితుల్లో తన నిర్ణయాన్ని మరోవిధంగా భావించవద్దని జగన్ విజ్ఞప్తి చేశారు.

# ఎమ్మెల్యేగా పోటీకి 21 ఏళ్లు చాలు

## – రాజ్యాంగం సవరించాలన్న రేవంత్ రెడ్డి



అలప్పుజ (ప్రశ్న న్యూస్) దేశంలో ప్రతి ఒక్కరి ఓటు హక్కును, రాజ్యాంగాన్ని కాపాడుకునేందుకు జరుగుతున్న పోరాటంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. 2029లో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీని ప్రధానిని చేసేందుకు యువత సంకల్పం తీసుకోవాలని ఆయన కోరారు. ఆదివారం కేరళలోని అలప్పుజలో కాంగ్రెస్ ఎంపీ కేసీ వేణుగోపాల్ నిర్వహించిన 'ఎంపీ మెరిట్ అవార్డ్స్-2025' కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ శాసనసభ ఎన్నికల్లో పోటీ చేసే కనీస వయసును 21 ఏళ్లకు తగ్గించాలని కీలక డిమాండ్ చేశారు. "21 ఏళ్లకే ఐఏఎస్ అధికారులు జిల్లాలను సమర్థంగా పరిపాలిస్తున్నప్పుడు, అదే వయసున్న యువకులు ఎమ్మెల్యేలుగా ఎందుకు పోటీ చేయకూడదు?" అని ప్రశ్నించారు. దీని కోసం రాజ్యాంగ సవరణ చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. గతంలో మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ ఓటు హక్కు వయసును 18 ఏళ్లకు తగ్గించారని గుర్తుచేశారు. 2026లో జరగబోయే కేరళ అసెంబ్లీ ఎన్నికలు, 2029లో దేశ భవిష్యత్తును నిర్దేశిస్తాయని రేవంత్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీకి డబ్బు, అధికారం, మీడియా మద్దతు లేకపోయినా.. ప్రజల మద్దతు పుష్కలంగా ఉందని తెలిపారు. గత లోక్‌సభ ఎన్నికల్లో రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలను తెలంగాణ నుంచి పోటీ చేయమని ఆహ్వానించామని, కానీ వారు కేరళను తమ కర్మభూమిగా ఎంచుకున్నారని చెప్పారు. బీజేపీ యువత రాజ్యాంగ హక్కులను కాలరాస్తోందని, వారి హక్కుల పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ పోరాడుతోందని అన్నారు. "దేశంలో మార్పు తీసుకురాగల శక్తి యువతకు ఉంది. యువతే మా బ్రాండ్ అంబాసిడర్లు. వారి భవిష్యత్తు కోసం వారు చేసే పోరాటం కచ్చితంగా విజయం సాధిస్తుంది" అని ఆయన ధీమా వ్యక్తం చేశారు. దేశంలో ఓట్ల దొంగతనానికి వ్యతిరేకంగా లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ నాయకత్వంలో పెద్ద ఉద్యమం నడుస్తోందని, అందులో అందరూ చేరాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ అభివృద్ధి నమూనా గురించి మాట్లాడుతూ, 'తెలంగాణ రైజింగ్-2047' లక్ష్యంతో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తున్నామని తెలిపారు. 2035 నాటికి 1 ట్రిలియన్ డాలర్లు, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థను సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని వివరించారు. రాష్ట్రంలో కేవలం 55 రోజుల్లో 11,055 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేశామని, 100 నియోజకవర్గాల్లో రూ. 200 కోట్ల వ్యయంతో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ పాఠశాలలను నిర్మిస్తున్నామని తెలిపారు. యువతలో నైపుణ్యాలను పెంచేందుకు ప్రముఖ పారిశ్రామికవేత్త ఆనంద్ మహీంద్రా ఛైర్మన్‌గా యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేశామని పేర్కొన్నారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588